

కలకులం..!

● రాష్ట్రంలో సంచలనం రేపుతున్న కులగణన ● మద్దతుపై నేతల్లో అయోమయం
● వెలుగులోకి మరో 398.. ● తెలీదు, చెప్పలేమన్న 6లక్షల మంది ● ఒక్కలిగల ఆగ్రహం..

బెంగళూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): విద్య, సామాజిక, ఆర్థిక అం శాలపై నిర్ధారించేందుకు జరిపిన కులగణన సర్వే రాష్ట్ర రాజకీయాల్లో కలకలం రేపుతోంది. కుల గణన పై పలువురు నేతలు హడలెత్తిపోతున్నారు. పార్టీని నమ్ముకోవాలా.. కులం వెంట నడవాలా... అనేది అయోమయంగా మారింది. ఇదంతా ఒక వైపు అయితే.. మరోవైపు కులగణనతో దశాబ్దాలకాలంగా బహిరంగం కాని 398 కులాలు వెలుగులోకి వస్తున్నాయి. ఏకంగా 200మంది లోపు జనాభా కల్గిన ఉపకులాలు ఉన్నాయి. అంతకుమించి మాకులం ఏమిటో తెలియదు, చెప్పము, అది మా వ్యక్తిగతం అనేవారు 6లక్షలమందికిపైగా ఉండడం మరో విశేషం. బీసీ కమిషన్ రాష్ట్రంలో 2015లో కులగణన సర్వే జరగగా ఇప్పటివరకు గుర్తింపులేని 398 కులాలు బహిరంగమయ్యాయి. హెచ్ కాంతరాజ్ అధ్యక్షతన బీసీ వర్గాల కమిషన్ జరిపిన సర్వేపై అధ్యయనం చేసిన బీసీ కమిషన్ ఛైర్మన్ జయప్రకాశ్‌హెగ్డే నేతృత్వంలోని కమిషన్ 2024లో రాష్ట్రప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. అప్పటి నుంచి సీఎం సిద్దరామయ్య కులగణన నివేదికను స్వీకరిస్తామని ప్రకటిస్తూ వచ్చారు. అయితే రాష్ట్రంలో బలమైన సామాజికవర్గం వీరలింగాయత , ఒక్కలిగ కులాలు దీనిని వ్యతిరేకిస్తూ వచ్చాయి. ఈ రెండు కులాలకు రాష్ట్రంలో వందలాది మఠాలు ఉండడంతో పీఠాధిపతులు, స్వామీజీలు కులగణన సమంజసం కాదని అభ్యంతరాలు వ్యక్తం చేస్తూ వచ్చారు. ప్రస్తుతానికి గతవారం కేబినెట్‌లో కులగణన నివేదిక సీల్డ్ కవర్ రూపంలోనే మంత్రివర్గం స్వీకరించింది. నివేదికను మంత్రులకు అందించి అధ్యయనం చేయాలని ఈనెల 17న నిర్ణయం తీసుకుందామని సీఎం సిద్దరామయ్య సహచరమంత్రులకు సూచించారు. ప్రస్తుతానికి నివేదిక మంత్రుల వద్ద మాత్రమే రహస్యంగా ఉందని చెప్పుకొంటున్నా ఇప్పటికే బహిరంగం అయినట్లు తెలుస్తోంది. ఏ సామాజికవర్గంలో ఎంత జనాభా ఉన్నారనే గణాంకాలు వెలుగులోకి వచ్చాయి. అంతకుమించి ఏకంగా 398 కులాలు ఇప్పటివరకు గుర్తింపులేని విధంగా ఉన్నాయనేది బహిరంగమైంది. ఇది రాష్ట్ర చరిత్రలోనే మరో సంచలనంగా మారింది. ఈ 398 కులాల్లో 200 లోపు జనాభా కల్గినవారు ఉన్నారు. కొన్ని కులాలకు 10మందిలోపు జనాభా కూడా ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది.

తక్కువ జనాభా కల్గిన కులాలు

కేటగిరి 1ఏలో		కంసన్	195
డవేరి	196	కంసార్	168
కేల్కరి	151	శిల్పి	4
కంజర్/కంజరి	194	ఓస్తా	4
కేటగిరీ 1బిలో		పట్టునుల్కర్	4
టికరి- ఉచిలియన్	135	నంబీశన్	6
శిల్‌వక్కల్	191	కొట్టియా	7
సన్యాసి	133	లోహర్	89
నాథహనగి	198	చెంబుకుట్టి	91
నాథశివయోగి	199	తచాయిరి	84
నాథశివజోగి	115	జంబుకులక్షత్రియ	61
నాథయోగి	158	మల్లార్	41
రావల	11	కోటిగార్ మేత్రి	138
ఏరాలు	183	కేటగిరీ 2బిలో	
జవరి	172	ముస్లిం, ఉపకులాలు	
కంజిర్	107	కేటగిరీ 3ఏలో	
కావడి	176	జీరిగ కుంచటిగ	67
ధనకర్‌గౌడి	13	గేరుబీజ బలిజ	137
పాశాచారి	149	కస్టన్	165
తుళుగ్ ఒడ్డర్	193	కేటగిరీ 3బీలో	
మరుత్తవర్	5	జంగమ	47
కేటగిరీ 2ఏలో		కంసాల లింగాయత	96
సుప్లిగ / సుబలిగ్	165	ఖావాడిగ లింగాయత	125
హలేపైక్ /హలేపైకర	194	లింగదార్	3
పల్లీరెడ్డియార్	90	వీరశైవమల్లావర	9
బలాలాల్ గౌండర్ /		వీరశైవజంగమ	11
		లింగాయతగౌడ	22
వెల్లాల గౌండర్	32	సాత్తదవల్	123

తెలియదు.. చెప్పలేం..

కులగణనలో 5,98,14,942మంది వివరాలను సర్వేద్వారా సేకరించారు. 2,53,954మంది తమ కులాలను బహిరంగం చేసేందుకు నిరాకరించారు. 1,34,319మంది ఏ కులానికి చెందినవారు కామని తేల్చి చెప్పారు. 1,94,003మంది కులం తెలియదన్నారు. వెనుకబడిన కులాల్లో వారి వృత్తి, వెనుకబాటు ప్రకారం 3 కేటగిరీలుగా విభజించారు. అందులో 1ఏ, 1బీ, 2ఏ, 2బీ, 3ఏ, 3బీగా వర్గీకరించారు. ప్రతి కేటగిరీలోనూ కులం పేరు, అందులో జనాభాను గుర్తించారు. గణాంకాల ప్రకారం 1ఏలో 147, 1బీలో 386, 2ఏలో 363, 2బీలో ముస్లింలు, ఉపకులాలు, 3ఏలో 85, 3బీలో 109 కులాలు ఉన్నాయి. 200కంటే తక్కువ జనాభా కల్గిన కులాలు 47 ఉన్నాయి. 1ఏలో 200లోపు జనాభా కల్గినవారు 3 కులాలు కాగా 1బీలో కేవలం 5మంది జనాభా కల్గిన కులం మరుత్తవర్, 12మంది జనాభా కల్గిన రావల అనే కులం ఉంది. 200లోపు జనాభా కల్గిన 16 కులాల్లో 2ఏలో నలుగురు జనాభా కల్గిన శిల్పి, ఓస్త, పట్టునాల్కర్, నంబీశన్, ఏడుమంది జనాభా కల్గిన కొట్టియాతోపాటు 200మందిలోపు ఉండే 17కులాలు ఉన్నాయి.

కొత్త ఉపకులాలు..

3ఏలో 200లోపు జనాభా కల్గిన మూడు కులాలు ఉండగా 3బీలో లింగాయత ఉపకులాలకు సంబంధించి లింగదార్‌లు 9మంది, వీరశైవమల్లాపురలో 11మంది, వీరశివజంగమతోపాటు 200లోపు జనాభా కల్గినవి 8కులాలు ఉన్నాయి. 1,35,35,773 ఇళ్లల్లో సర్వే జరిపారు. 180 ఎస్సీ, 105 ఎస్టీతోపాటు 1351 కులాలు ఇప్పటివరకు గుర్తించలేనివి కూడా ఉన్నాయి. కొందరు తమ కులాలు తెలియవని, చెప్పమన్నవారు కూడా ఉన్నారు. 54 అంశాలతో జరిపిన సర్వేలో తక్కువ జనాభా కల్గిన కులాలు పల్లె ప్రాంతాలలోనే ఎక్కువగా ఉన్నాయి.

రాష్ట్ర బంద్‌కు సిద్ధమైన ఒక్కలిగలు

బెంగళూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కులగణన నివేదికను వ్యతిరేకిస్తూ ఒక్కలిగ సంఘం ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని సంఘం అధ్యక్షుడు కెంచప్ప గౌడ హెచ్చరించారు. మంగళవారం ఒక్కలిగసంఘం అత్యవసరంగా సమావేశమైంది. కులగణన నివేదిక సమంజసంగా లేదని అధ్యక్షుడు కెంచప్పగౌడ మండిపడ్డారు. పదేళ్లక్రితం నాటి నివేదికను ఇప్పుడు ఎలా అంగీకరించాలని ప్రశ్నించారు. ఒక్కలిగలను 61లక్షల మంది మాత్రమే చూపారన్నారు. ఎన్నికలు జరిగినప్పుడు తాలూకాలవారీగా పరిశీలించామని, ఒక్కలిగల జనాభా ఎంత అనేది స్పష్టంగా తేల్చలేదన్నారు. ఒక్కలిగలకు అన్యాయం చేసేందుకు కుట్ర సాగుతోందన్నారు. అందరం కలసి కర్ణాటక బంద్ చేస్తామన్నారు. అన్యాయానికి గురైనవారంతా కలసిరావాలన్నారు. వీరశైవ సముదాయానికి చెందినవారితోనూ పోరాటంపై మాట్లాడతామన్నారు. ఒక్కలిగసంఘం ప్రధాన కార్యదర్శి కోనప్పరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తామన్నారు. ఈనెల 17న కేబినెట్ నిర్ణయం తర్వాత తమ పోరాటంపై స్పష్టత ఇస్తామన్నారు. కర్ణాటక బంద్ చేపడ్తామని తేల్చి చెప్పారు.



మాట్లాడుతున్న ఒక్కలిగ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కెంచప్పగౌడ


సీఎంతో చర్చలు జరుపుతున్న లారీ యజమానులు

సీఎంతో చర్చలు విఫలం

● రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడి లారీలు అక్కడే
● నిత్యావసరాలకు మాత్రమే మినహాయింపు
● మరోసారి మాట్లాడతానన్న ముఖ్యమంత్రి

బెంగళూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో డీజిల్ ధరలు, టోల్‌చార్జీల పెంపును నిరసిస్తూ లారీ యజమానులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. సంఘం పిలుపుతో రాష్ట్రవ్యాప్తంగా లారీల బంద్‌తో సరుకురవాణా స్తంభించింది. సోమవారం అర్ధరాత్రి నుంచి రాష్ట్రంలోని సుమారు 6లక్షల వాహనాలు ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. ఒక్కసారిగా సరుకు రవాణా వాహనాలు రోడ్డెక్కకపోవడంతో గందరగోళం ఏర్పడింది. దీంతో రవాణా శాఖ మంత్రి రామలింగారెడ్డి రంగంలోకి దిగారు. లారీ యజమానుల సంఘం అధ్యక్షుడు షణ్ముగప్పతోపాటు కార్యవర్గ సభ్యులతో సీఎం సిద్దరామయ్యతో జరిపిన చర్చలు విఫలమయ్యాయి. మరోసారి ముఖ్యమంత్రితో చర్చలకు ఏర్పాట్లు చేశారు. అధికారిక నివాసం కృష్ణలో లారీ యజమానులసంఘంతో చర్చలు జరిగాయి. సుమారు గంటన్నరకుపైగా చర్చలు జరిగి విఫలమయ్యాయి. లారీ యజమానుల డిమాండ్లకు ప్రభుత్వం ససేమిరా అనడంతో సమ్మె కొనసాగిస్తామని సంఘం అధ్యక్షుడు షణ్ముగప్ప తేల్చి చెప్పారు. ఇదే విషయమై ముఖ్యమంత్రి సిద్దరామయ్య మీడియాతో మాట్లాడుతూ మరోసారి చర్చలు జరుపుతామన్నారు. లక్షలాది వాహనాలు స్తంభించడంతో భారీగా సరుకు ఎక్కడికక్కడ నిలిచిపోయింది. యశ్వంతపుర మార్కెట్‌యార్డులో సరుకు స్తంభించడంతో వ్యాపారులు ఇబ్బంది పడ్డారు. మరోవైపు వివిధ ప్రాంతాలనుంచి సరుకు రాక నిలిచిపోయింది. సమ్మెనుంచి పాలు, ఇతర అత్యవసర వాటికి మినహాయింపు ఇచ్చారు.


కంఠీరవనగర్‌లో ఆగిన లారీలు


గూడ్స్ రైలు నుంచి వేరుపడిన బోగీలు

పట్టాలు తప్పిన గూడ్స్ రైలు

● పలు రైళ్ల రాకపోకలకు అంతరాయం ● బెళగావి సమీపంలో ఘటన

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మీరజ్‌వైపు వెళ్తున్న గూడ్స్ రైలు రెండు బోగీలు పట్టాలు తప్పాయి. మంగళవారం ఉదయం బెళగావి నగరం సమీపంలోని మిలిటరీ మహాదేవ మందిరం వద్ద ప్రమాదం జరిగింది. అధికారుల అప్రమత్తం కారణంగా అటువైపువెళ్ళే రైళ్ళను ఆపివేయడంతో పెను ప్రమాదం తప్పినట్లు అయింది. బళ్ళారి జిల్లా, తోరణగల్లు సమీపంలోని జిందాల్ ఉక్కు కర్మాగారం నుంచి ఇనుప ఖనిజాన్ని మీరజ్‌వైపు తీసుకెళుతున్న రైలు పట్టాలపై మార్గాన్ని మార్చుకుంటున్న సమయంలో ఈ ప్రమాదం జరిగినట్లు రైల్వే అధికారులు గుర్తించారు. ఈ ఘటనలో మీరజ్‌వైపు వెళ్ళే ప్యాసింజర్ రైళ్ళ రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బెళగావి-మీరజ్ మార్గంలోని రైళ్ళ సంచారం పూర్తిగా నిలిచిపోయాయి. పనులు పునరుద్ధరణ తరువాత రైళ్ల రాకపోకలు ప్రారంభం అవుతాయని రైల్వే అధికారులు ప్రకటించారు. ఇప్పటికే మీరజ్ నుంచి వస్తున్న చాళుక్య శరావతి ఎక్స్‌ప్రెస్, ఎల్‌టీటీ దాదర్, ఆజ్మీర్ ఎక్స్‌ప్రెస్ మార్గమధ్యలో నిలిపి వేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అదేవిధంగా బెళగావి నుంచి బయలు దేరిన రాణిచెనమ్మ ఎక్స్‌ప్రెస్, బెంగళూరు జోద్‌పూర్ ఎక్స్‌ప్రెస్, బెంగళూ నుంచి భగత్ కోటి, క్యాసల్ రాక్-మీరజ్ ప్యాసెంజర్, హరిప్రియా ఎక్స్‌ప్రెస్ రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. బెళగామ్ నుంచి బళ్ళారి మీదుగా వెళ్ళే రాళ్ళ రాకపోకల్లో కూడా అంతరాయం ఏర్పడినట్లు అధికారులు తెలిపారు.


పునరుద్ధరణ పనుల్లో రైల్వే అధికారులు

సామాన్యులపై ధరల మోత..!

● పేదల మేలు మరిచిన కేంద్రం ● వక్ఫ్ చట్టం వెనుక బీజేపీ కుట్ర ● ఏఐసీసీ కార్యదర్శి గోపినాథ్ పళియప్పన్

బళ్లారి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సామాన్యులకు ధరల మోత తప్పడం లేదని, కుట్రరాజకీయాలకు పాల్పడుతూ మతాల మధ్య చిచ్చు రేపుతూ దేశంలో ప్రశాంతత లేకుండా చేస్తోందని ఏఐసీసీ కార్యదర్శి గోపినాథ్ పళియప్పన్ మండిపడ్డారు. మంగళవారం బళ్లారి, విజయనగర జిల్లాలో జిల్లా కాంగ్రెస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి గోపినాథ్‌పళియప్పన్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. బళ్లారి ఎంపీ సయ్యద్ నాజీర్ హుసేన్, ఎంపీ ఈ. తుకారం, ఎమ్మెల్యేలు నారా భరత్‌రెడ్డి, మాజీ మంత్రి బి. నాగేంద్ర, సిరుగుప్ప ఎమ్మెల్యే నాగరాజు, మాజీ ఎమ్మెల్సీ అల్లం వీరభద్రప్ప, మేయర్ నందీష్‌బాబు, మాజీ మేయర్ రాజేశ్వరి సుబ్బరాయుడు తదితర పార్టీ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా గోపీనాథ్ మాట్లాడుతూ వక్ఫ్ చట్టం వల్ల ముస్లింలకు తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. మత రాజకీయాలకు స్వస్తి చెప్పకపోతే బీజేపీ మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. మాజీ మంత్రి నాగేంద్ర మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తలు ప్రత్యేక బలమన్నారు. దేశానికి స్వాతంత్రం రావడానికి కాంగ్రెస్ నాయకుల పోరాటమే కారణమన్నారు. ఎమ్మెల్యే భరత్‌రెడ్డి మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వచ్చాక జీఎస్టీల పేరుతో పేదలపై భారం మోపుతోందన్నారు. ఎంపీ సయ్యద్ నాసీర్ హుసేన్ మాట్లాడుతూ బీజేపీ దేశంలో మతపరమైన రాజకీయం చేస్తుందని వక్ఫ్ చట్టం పేరుతో ముస్లిం లకు ద్రోహం చేయాలని చూస్తోందన్నారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో జడ్పీ, టీపీ, అన్ని స్థానిక సంస్థల్లో కాంగ్రెస్ గెలుపు సాధించాలన్నారు. గ్రామస్థాయిలో కమిటీలు బలంగా ఏర్పడాలన్నారు. వీరితోపాటు కార్పొరేటర్ విక్కీ, మించు శ్రీనివాసులు, కుబేరా, కనేకల్లు మాబూసాబ్, అన్ననాగరాజు, గోవర్ధన్‌రెడ్డి, వాల్మీకిశ్రీనాథ్, గుమ్మనూరు జగన్, తదితర కాంగ్రెస్ కార్పొరేటర్లు, కార్యకర్తలు. అభిమానులు, నాయకులు పాల్గొన్నారు. అనంతరం కార్యక్రమంలో ఎంపీ సయ్యద్ నాసీర్ హుసేన్‌ను బళ్లారి కాంగ్రెస్ కమిటీ తరుపున ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నారా మాట్లాడుతూ.. ఎంపీ అయిన తర్వాత ఆయన బళ్లారికి రావడం ఇది మూడో సారి అని, అయన బళ్లారి వాసి కావడం హర్షణీయమన్నారు. కార్యక్రమానికి ముందుగా బళ్లారి గాంధీనగర్ లోని ఎమ్మెల్యే కార్యాలయం నుంచి బైక్ ర్యాలీ చేపట్టారు.


వేదికపై బళ్లారి జిల్లా కాంగ్రెస్ నేతలు



కమిటీల్లో మహిళలకు ప్రాధాన్యం

● ప్రతి కమిటీలో 25 మంది తప్పనిసరి
● జడ్పీ, టీపీ ఎన్నికల్లో విజయం సాధించాలి
●నేతలకు గోపినాథ్ సూచన

కాంగ్రెస్ పార్టీ కమిటీలో మహిళలు, యువత, మైనార్టీ, క్రిస్టియన్లకు ప్రాధాన్యం ఇవ్వాలని డీసీసీ కమిటీకి ఏఐసీసీ కార్యదర్శి గోపినాథ్ పళియప్పన్ సూచించారు. ప్రతి కమిటీలో 25 మంది ఉండాలని ఇందులో సగబాగం మంది మహిళలు, యువకులు ఉండాలని సూచించారు. మంగళవారం బళ్లారి, విజయనగర జిల్లాలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి బళ్లారిలో డీసీసీ అధ్యక్షుడు అల్లం ప్రశాంత్ అధ్యక్షతన వహించారు. విజయనగలో సిరాజ్ షేక్ సమావేశం జరిగింది. బళ్లారి సిటీ ఎమ్మెల్యే నారా భరత్‌రెడ్డి, మాజీ మంత్రి నాగేంద్ర, సిరుగుప్ప ఎమ్మెల్యే బి. నాగరాజు, హొస్పేట్ ఎమ్మెల్యే గవియప్ప తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో ఏఐసీసీ కార్యదర్శి గోపినాథ్ పళియప్పన్ మాట్లాడుతూ కల్యాణ కర్ణాటకలోని ఏడు జిల్లాలోనూ, అలాగే రాష్ట్రంలో అన్ని జిల్లాలోనూ కాంగ్రెస్ గ్రామకమిటీ, బూత్ కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. జూన్‌లో జరిగే జడ్పీ, టీపీ ఎన్నికల నాటికి కమిటీలు కమిటీల ప్రక్రియ పూర్తి చేయాలని సూచించారు. గ్రామకమిటీలు పాదర్శంగా ఉండాలన్నారు. బీజేపీ ప్రభుత్వంలో ధరలు పెరుగుతున్నాయని, దీనికి నిరసనగా ఈనెల 17న బెంగళూరులో కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు తెలిపారు. ఆందోళనకు కాంగ్రెస్ కదిలి రావాలన్నారు. ధరల పెంపుపై బీజేపీ దిగా రావాలన్నారు.

నేడు చౌడేశ్వరీదేవి జ్యోతుల ఉత్సవం 7 ధరల నియంత్రణకు చట్టాలు తేవాలని రైతుల నిరసన

కన్నడ ప్రాబల్యాన్ని పెంచేందుకే సాహిత్య సదస్సు
● డిసెంబరులో బళ్లారిలో 88వ అఖిల భారత సదస్సు 8

విద్యార్థికి నైపుణ్యం, గుణాత్మకత కీలకం

● విజయవంతంగా 50ఏళ్ల విద్యా ప్రయాణం: ప్రెసిడెన్సీ చాన్సలర్ నిస్సార్ అహ్మద్ ● ఘనంగా ఇన్‌స్పైర్డ్ పురస్కారాల ప్రదానం

బెంగళూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉన్నత విద్యారంగం గణనీయమైన ప్రగతి సాధించిందని అయితే నైపుణ్యత, గుణాత్మకత విద్యార్థికి కీలకమని ప్రెసిడెన్సీ గ్రూప్ చాన్సలర్ నిస్సార్ అహ్మద్ అన్నారు. ప్రెసిడెన్సీ యూనివర్సిటీలో ఇన్‌స్పైర్డ్ 2025 పురస్కారాల ప్రదానం జరిగింది. సుదీర్ఘకాల సేవా పురస్కారం, ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, సాంస్కృతిక పరంపర పురస్కారాలను ప్రదానం చేశారు. చాన్సలర్ నిస్సార్ అహ్మద్ ఐదు దశాబ్దాల విద్యారంగ ప్రయాణంపై సుదీర్ఘంగా మాట్లాడారు. ఐదు దశాబ్దాలక్రితం విద్యారంగంలోకి అడుగు పెట్టానని ఎన్నో ఒడిదుడుకులతోపాటు విజయాలు అందుకున్నానన్నారు. విద్యార్థులకు సేవ అందించే పరంపరలో ఎన్నో మైలురాళ్లు అధిగమించామన్నారు. ప్రెసిడెన్సీ సంస్థ యూనివర్సిటీగా వేలాదిమందికి ఉన్నతమైన విద్య అందించే సంస్థగా రూపొందిందన్నారు. తన ప్రయాణాన్ని వివరిస్తూనే నిస్సార్ అహ్మద్ భావోద్వేగానికి లోనయ్యారు. ప్రెసిడెన్సీ సంస్థలో చేరే ప్రతి విద్యార్థికి గుణాత్మకమైన విద్య అందించాలనా నా కల సాకారమయ్యేందుకు ఎందరో చేతులు కలిపారన్నారు. ప్రెసిడెన్సీ ఎదుగుదలకు సహకరించిన వారందరికీ రుణపడి ఉన్నానన్నారు. ప్రపంచదేశాలలో సాంకేతిక విద్యలో భారత్ తిరుగులేనిస్థాయికి చేరిందన్నారు. అందుకు విద్యాసంస్థల కృషి కీలకమన్నారు. ప్రెసిడెన్సీ పూర్వ విద్యార్థులు విశ్వవ్యాప్తంగా రాణిస్తున్నారనేది వెలకట్టలేని సంతోషమన్నారు. ప్రెసిడెన్సీ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ డైరెక్టర్ డాక్టర్ నఫీజా అహ్మద్ మాట్లాడుతూ.. విద్యార్థులు, సమాజ రూపకల్పనలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమన్నారు. ప్రెసిడెన్సీ ఎదుగుదలలో వెన్నెముకలా ఉపాధ్యాయులు కీలకపాత్ర పోషించారన్నారు. వారి అద్భుత ప్రయత్నాలకు గౌరవమే సంస్థ ఎదుగుదల అన్నారు. ఉపాధ్యాయుల అంకితభావం, సృజనాత్మకత ప్రతిరోజూ విద్యార్థులను ప్రేరేపించిందన్నారు. ప్రతి ఉపాధ్యాయుడికి ధన్యవాదాలన్నారు. ప్రముఖ రచయిత్రి అనితా నాయర్, మాజీ ఐపీఎస్ సంజయ్‌సహాయ్‌లు, ప్రెసిడెన్సీ ఫౌండర్ ట్రస్టీ కౌసర్ నిస్సార్ అహ్మద్‌లు పాల్గొన్నారు. అధ్యాపకులను ఘనంగా సత్కరించారు.


ఇన్‌స్పైర్డ్ కార్యక్రమం ప్రారంభిస్తున్న చాన్సలర్ నిస్సార్ అహ్మద్


ఈత కొడుతూ సేద తీరుతున్న చిన్నారులు



ఉక్క ఈతకు పోత..!



నగరంలో ఎండలు మండిపోతున్నాయి. బయట అడుగుపెడితే భానుడి భగభగ మండిపోతున్నాడు. పలు పాఠశాలలకు ఇప్పటికే సెలవులు వచ్చాయి. ఇంట్లో ఉక్కపోతతో చిన్నారులు విలవిలలా డుతున్నారు. ఉక్కపోతకు భరించలేక చిన్నా, పెద్ద తేడా లేకుండా ఈతకు పరుగులు తీస్తున్నారు. మధ్యాహ్నమైతే చాలు నగరంలోని స్విమ్మింగ్‌పూల్స్ కిటకిట లాడుతున్నాయి. ఈత నేర్చుకోవడంతోపాటు సరదాగా నీటి చల్లదనాన్ని ఆస్వాదిస్తూ సేద తీరుతున్నారు. మహాలక్ష్మి లే అవుట్ లోని బీబీఎంపీకి చెందిన స్విమ్మింగ్‌పూల్‌లో మంగళ వారం చిన్నారులు ఇలా ఉత్సాహంగా ఈత కొడుతూ కనిపించారు.

(స్టాఫ్ ఫొటోగ్రాఫర్, బెంగళూరు)



పుట్లూరులో దెబ్బతిన్న అరటి పంట



గార్లదిన్నె మండలం ఇల్లూరులో దెబ్బతిన్న వరి పంట

గాలివాన విధ్వంసం

● రూ.2.28 కోట్ల పంటనష్టం ● 266.6 హెక్టార్లల్లో దెబ్బతిన్న పంటలు



జంబులదిన్నెలో పడిపోయిన మామిడిచెట్లను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి



దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు



అరటి పంటను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖ అధికారి

అనంతపురం అర్బన్/నెట్‌వర్క్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలు, ఈదురు గాలులు రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తున్నాయి. ఉద్యాన, వ్యవసాయ శాఖ పరిధిలో రూ.కోట్ల విలువైన పంట నష్టం జరుగుతోంది. దీంతో రైతులు గుండెలు బాదుకుంటున్నారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని విన్నవిస్తున్నారు. జిల్లాలో సోమవారం రాత్రి ఈదురు గాలులు, వర్ష బీభత్సానికి 266.6 హెక్టార్లల్లో రూ.2.88 కోట్ల విలువైన పంటలు దెబ్బతిన్నాయి. శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పల, పుట్లూరు, అనంతపురం, యల్లనూరు, ఉరవకొండ, కూడేరు, కళ్యాణదుర్గం, బెళుగుప్ప, రాయదుర్గం, గుమ్మఘట్ట, గుంతకల్లు, పెద్దవడుగూరు మండలాల్లో 115 మంది రైతులకు సంబంధించి 94.60 హెక్టార్లల్లో రూ.1.48 కోట్ల విలువైన అరటి, మామిడి, బొప్పాయి, కర్బూజ, మునగ, కాకర పంటలు దెబ్బతిన్నాయి. నార్పల, గార్లదిన్నె, కంబదూరు, శింగనమల మండలాల్లో 93 మంది రైతులకు సంబంధించి 172 హెక్టార్లల్లో రూ.1.40 కోట్ల విలువైన మొక్కజొన్న, వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. జిల్లాలోని ఎనిమిది మండలాల్లో సోమవారం రాత్రి వర్షం కురిసింది. అత్యధికంగా కణేకల్లులో 10.4 మి.మీ. వర్షపాతం నమోదైంది. పుట్లూరు 9.4, నార్పల 9.2, బెళుగుప్ప 7.8, గుత్తి 7.2, కంబదూరు 2.6, ఉరవకొండ 2.2, అనంతపురం 1.2 మి.మీ. వర్షపాతం నమోదైంది.

● పుట్లూరు మండలంలో ఈదురు గాలులకు 80 ఎకరాల్లో అరటి పంట నష్టం జరిగిందని ఉద్యాన శాఖ అధికారి శైలజ తెలిపారు. కడవకల్లు, దోసలేడు, చెర్లోపల్లి, మడ్డిపల్లి గ్రామాల్లో 40 మంది రైతులు నష్టపోయారని, ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నామని ఆమె తెలిపారు.

● నార్పల మండలం బండ్లపల్లి, గంగనపల్లి, బి.పప్పూరు గ్రామాల్లో దెబ్బతిన్న అరటి పంటను జిల్లా ఉద్యాన శాఖ అధికారి ఫిరోజ్‌ఖాన్, ఉద్యాన అధికారి శైలజ పరిశీలించారు. నార్పల, హెచ్ శోధనపల్లి గ్రామాల్లో దెబ్బతిన్న మామిడి తోటలను ఉద్యాన విస్తరణాధికారి హరిచరణ్ రెడ్డి, రైతు సేవా సిబ్బంది దివ్య, శశిధర్, పరిశీలించారు. నష్టం వివరాలను నమోదు చేసుకున్నారు.

● గార్లదిన్నె మండలం కొప్పలకొండ, ఇల్లూరు, జంబులదిన్నె, కేశవాపురం, కమలాపురం, సిరివరం తదితర గ్రామాల్లో వరి, మొక్కజొన్న, మామిడి పంటలకు తీవ్ర నష్టం జరిగింది. వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పది మంది రైతులకు చెందిన 15 ఎకరాల వరి పంట, ఆరుగురు రైతులకు చెందిన 10 ఎకరాల మొక్కజొన్న పంట దెబ్బతిన్నట్లు గుర్తించారు. నష్ట పరిహారం అందచేలా చర్యలు తీసుకుంటామని వ్యవసాయ అధికారి సోమశేఖర్ రైతులకు భరోసా ఇచ్చారు. ఇల్లూరు, జంబులదిన్నె తదితర గ్రామాల్లో కూలిన మామిడి చెట్లను అధికారులు పరిశీలించి, వివరాలను నమోదు చేసుకున్నారు. బాధిత రైతులకు నష్ట పరిహారం వస్తుందని తెలిపారు.

రైతులను ఆదుకోవాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ

కూడేరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలతో ఉద్యాన పంటలు దెబ్బతిని తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామక్రిష్ణ డిమాండ్ చేశారు. మండలంలోని కడదరకుంట, చోళసముద్రం గ్రామాల్లో దెబ్బతిన పంటలను ఆయన మంగళవారం పరిశీలించారు. కడదరకుంట గ్రామానికి చెందిన రైతు లక్ష్మీనారాయణ నాలుగెకరాల్లో సాగు చేసిన అరటి పంట ఈదురుగాలలు, వర్షానికి పూర్తిగా పడిపోయింది. రూ.8 లక్షల వరకు పెట్టుబడులు పెట్టి సాగు చేసిన పంట పూర్తిగా దెబ్బతిందంటూ రైతు కన్నీరు మున్నీరయ్యాడు. దిగుబడి ఆశాజనకంగా రావడంతో అప్పుల నుంచి బయట పడుతాననుకున్న సమయంలో అకాల వర్షం, ఈదురుగాలులు దెబ్బతీశాయని వాపోయాడు. అనంతరం చోళసముద్రం గ్రామానికి చెందిన రైతు వెంకటనారాయణ అరటి తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా రామక్రిష్ణ మాట్లాడుతూ.. అనంతపురం, కడప జిల్లాల్లో ఈదురుగాలులు, వడగండ్ల వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయన్నారు. ప్రభుత్వం తక్షణం ఎకరాకు రూ.50 వేలు పరిహారం అందించి, రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నారాయణస్వామి, కేశవరెడ్డి, గోపాల్, రమణ, రాజేష్‌గౌడ్, ఏఐఎస్ఎఫ్ కుళ్లాయిస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పెరుగు సంగప్ప, మల్లికార్జున, రమణ, మలరాయుడు పాల్గొన్నారు.

● కూతురు..!



అమ్మా..
త్వరగా తొయ్..
బడికి సమయమౌతోంది..!
బతుకు బాధ్యత నీదే
అయినా..
కాస్తంత బరువు
పంచుకోవడం..
నా బాధ్యత కూడానూ..!

(గుంతకల్లు పట్టణానికి చెందిన ఈ చిన్నారి పేరు ఐశ్వర్య. ఎస్‌జేపీ పాఠశాల విద్యార్థిని. తల్లి సుకన్య తోపుడు బండిపై పండ్లను అమ్ముతుంటారు. తండ్రి రవి కుమార్ దినకూలీ. శ్రమ జీవుల కుటుంబంలో పుట్టిన ఈ కూతురుకు చదువంటే ఆసక్తి. రోజూ ఉదయం ఇలా తల్లికి సాయంగా బండిని తోసుకుంటూ పండ్లు అమ్మే ప్రాంతానికి చేరుస్తుంది. ఆ తరువాత బడికి వెళ్లిపోతుంది. మంగళవారం ఉదయం కూడా ఇలా తల్లికి సాయం పడుతూ.. 'త్వరగా తొయ్ అమ్మా.. బడికి టైం అవుతోంది..' అంటూ ఆత్రపెడుతూ కనిపించింది)

- ఆంధ్రజ్యోతి, గుంతకల్లు టౌన్

24 నుంచి డిగ్రీ పరీక్షలు

జ్ఞానభూమి, ఎస్కేయూ వెబ్‌సైట్లలో హాల్ టిక్కెట్లు

ఎస్కేయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్

అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఎస్కేయూ ఆధ్వర్యంలో ఈనెల 24నుంచి డిగ్రీ రెగ్యులర్, సప్లిమెంటరీతో పాటు, మెగా సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేష్ మంగళవారం తెలిపారు. ప్రథమ సంవత్సరం ద్వితీయ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 24నుంచి మే 6వరకు. ద్వితీయ సంవత్సరం నాలుగో సెమిస్టర్ ఈ నెల 25నుంచి మే 31 వరకు ఉంటాయన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 55 కేంద్రాల్లో 25వేల మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారన్నా రు. విద్యార్థులు హాల్ టిక్కెట్లను జ్ఞానభూమి పోర్టల్‌లో డౌన్ చేసుకోవచ్చని సూచించారు. మెగా సప్లిమెంటరీ విద్యార్థులు ఎస్కేయూ వెబ్‌సైట్‌లో డౌన్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. తృతీయ సంవత్సరం ఐదు, ఆరు సెమిస్టర్ విద్యార్థులకు ఈనెల 24నుంచి మే 16వ తేదీ వరకు సప్లిమెంటరీ పరీక్షలుంటాయని వివరించారు.

జిల్లావాసులకు కందుకూరి పురస్కారాలు

అనంతపురం కల్చరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన 13 మందికి జిల్లా స్థాయి కందుకూరి విశిష్ట పురస్కారాలు లభించాయి. కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ అనుబంధ చలనచిత్ర టీవీ, నాటకరంగ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 2025 సంవత్సరానికి రాష్ట్రవ్యాప్తంగా పురస్కారాలు ప్రకటిం చారు. ముగ్గురిని రాష్ట్రస్థాయి కందుకూరి ప్రతిష్టాత్మక రంగస్థల పురస్కారాలకు, 107 మందిని జిల్లాస్థాయి కందుకూరి విశిష్ట పురస్కారా లకు ఎంపిక చేశారు. రంగస్థల ప్రముఖులు బుర్రా సాయిమాధవ్, గుమ్మడి గోపాలకృష్ణ, పాటిబండ్ల ఆనంద రావు, చిక్కాల బాలాజి, కేకేఎల్ స్వామి, బాలాజీనాయక్, దాసరి చలపతిరావు, గాజుల పద్మజ, బుద్దాల వెంకటరామారావు న్యాయనిర్ణేతలుగా వ్యవహరించి పురస్కార గ్రహీతల ను ఎంపిక చేశారు. ఇందులో భాగంగా అనంతపురం జిల్లా తరపున 13 మందిని కందుకూరి విశిష్ట పురస్కారాలకు ఎంపిక చేశారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించనున్న సభలో వీరికి పురస్కారాలతోపాటు నగదు బహుమతులు అందజేసి సత్కరించనున్నారు.

పురస్కార గ్రహీతలు వీరే...

వాల్మీకి కుళ్లాయప్ప, సోమర లక్ష్మీనారాయణ, సంగాల నారాయణస్వామి, పి.ఆనంద్, జేకే రామాంజనేయులు, వి.ఆదినారాయణరెడ్డి, జీజే ఎర్రిస్వామి, ఎ.రామగోపాల్, జి.నరహరి, ఎస్ నారాయణస్వామి, శివశంకర్, డి.రాజకుళ్లాయప్ప, బి.వరప్రసాద్.

సంగీత పోటీల్లో గిన్నిస్ రికార్డు



గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్ అందుకుంటున్న జాస్మిన్ వేదశ్రీ

గుత్తి రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దొడ్డి ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఎస్జీ టీచర్ ఎంబీ జాస్మిన్ వేదశ్రీ క్రిస్టియన్ సంగీత పోటీల్లో గిన్నిస్ రికార్డు సాధించారు. గతేడాది డిసెంబరు 1న ఆవెంతోపాటు వివిధ ప్రాంతాలకు చెందిన 1046 మంది కళాకారులు ఆన్‌లైన్‌లో క్రిస్టియన్ పాటలు పాడారు. తద్వారా గిన్నిస్ రికార్డ్సులో స్థానం సంపాదించుకున్నారు. హైదరాబాద్‌లో ఈనెల 14వ తేదీన ఏర్పాటు చేసిన అభినందన సభలో బహుమతులతోపాటు సర్టిఫికెట్, మెడల్‌ను ప్రదానం చేసినట్లు టీచర్ తెలిపారు.

భళా.. మహిమాన్విత్..

రెండో తరగతి విద్యార్థికి గిన్నిస్ వరల్డ్ రికార్డు



గిన్నిస్ వరల్డ్ రికార్డు అందుకుంటున్న మహిమాన్విత్

చిలమత్తూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన రెండో తరగతి విద్యార్థి మహిమాన్విత్ పియానో వాయిద్యానికి గిన్నిస్ రికార్డు దాసోహమైంది. పియానో వాయిద్యాన్ని సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశాడు. ఆ వీడియోను చూసిన వారు ముగ్ధులయ్యారు. పోస్టు చేసిన గంటలోనే ఏకంగా 1,046 మంది వీక్షించి, అభినందించారు. దీంతో అతి తక్కువ సమయంలో ఎక్కువమంది వీక్షకులు చూసిన వీడియోగా గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ నిర్వాహకులు గుర్తించారు. దీంతో చిన్నారి మహిమాన్విత్‌కు అవార్డులో చోటు కల్పించారు. టేకులోడు ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ముత్యాలప్ప కుమారుడు మహిమాన్విత్.

స్థానిక ఎస్ఎస్‌వైవీఎన్ ప్రైవేటు పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. మహిమాన్విత్‌ను పాఠశాల కరస్పాండెంట్ భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, గ్రామస్థులు అభినందించారు.

ఏంటో ఈ పంచాయతీ?

పంచాయతీ కార్యదర్శులకు ప్రమోషన్ల దిగులు



- క్లరికల్ సిబ్బంది అసమర్థతతో అర్హులకు అన్యాయం
- ముందుకు కదలని గ్రేడ్-3, గ్రేడ్-4ల ప్రక్రియ
- గ్రేడ్-5కు మాత్రమే అప్పుడే శ్రీకారం
- ఏ ప్రాతిపదికన ఉద్యోగోన్నతి ఇస్తారోననే ఉత్కంఠ



(డీపీఓ కార్యాలయం(ఫైల్)

అనంతపురం న్యూటౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులను ప్రమోషన్ల దిగులు వేధిస్తోంది. జిల్లా పంచాయతీ కార్యాలయంలో క్లరికల్ సిబ్బంది అసమర్థతతో ప్రమోషన్లలో అర్హులకు అన్యాయం జరుగుతున్నట్లు సమాచారం. ఈక్రమంలో ఇప్పటి వరకు కొందరు గ్రేడ్-1 కార్యదర్శులకు మాత్రమే ఈఓఆర్డీలుగా ప్రమోషన్ కల్పించారు. గ్రేడ్-2 కార్యదర్శులలో కొందరికి గ్రేడ్-1 కార్యదర్శులుగా ఉద్యోగోన్నతి ఇచ్చి చేతులు దులుపుకున్నారు. పై రెండు కూడా కమిషనర్ కార్యాలయం పరిధిలో ఉండటంతో అక్కడికి నివేదిక పంపి, అక్కడ నుంచి వచ్చిన ఉత్తర్వుల మేరకు అవకాశం కల్పించారు. ఇక మిగిలిన గ్రేడ్లకు కలెక్టర్ ద్వారా అనుమతి పొంది తుది జాబితాను రూపొందించి కమిషనర్ కార్యాలయానికి పంపి ప్రమోషన్లు ఇవ్వాలి. అయితే అసలైన సమస్యలు ఇక్కడే మొదలయ్యాయి. సీనియార్టి జాబితా, రోస్టర్ తయారు చేయడంలో తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. ఆఖరికి ఏదోలా ఫైల్ తయారు చేసి కమిషనర్ కార్యాలయానికి పంపారు. అక్కడ నుంచి వచ్చే ఉత్తర్వుల మేరకు ఉద్యోగోన్నతుల ప్రక్రియ పూర్తి చేస్తామని చెప్పుకొస్తున్నారు. గ్రేడ్-3, గ్రేడ్-4 ఉద్యోగోన్నతుల ప్రక్రియ పూర్తి కాకనే గ్రేడ్-5 కార్యదర్శుల ప్రమోషన్ల ప్రక్రియకు శ్రీకారం చుట్టనున్నారు. అయితే మిగిలిన జిల్లాల్లో ఇప్పటికే ఉద్యోగోన్నతుల ప్రక్రియ ఎక్కడా పెండింగ్ లేకుండా తగిన చర్యలు చేపట్టి గ్రేడ్-5 కూడా పూర్తి చేశారు. దీంతో మీరెందుకు చేయలేకపోతున్నారని కమిషనర్ కార్యాలయం నుంచి డీపీఓను ప్రశ్నించినట్లు సమాచారం.

గతంలో దూకుడు.. ప్రస్తుతం బ్రేక్

డీపీఓ నాగరాజనాయుడు గతంలో పనిచేసిన ప్రాంతాల్లో చాలా చురుగ్గా ఎప్పటి సమస్యలు అప్పుడు పరిష్కరించారన్న గుర్తింపు పొందారు. అదే తరహాలో ఇక్కడ కూడ చేస్తారని సిబ్బంది ఆశించి, భంగపడ్డారు. నాగరాజనాయుడు కర్నూలు డీపీఓగా పని చేసిన రోజుల్లో అప్పటి ప్రభుత్వ అండదండలు మెండుగా ఉండేవన్న ప్రచారం జరుగుతోంది. దీంతో తమ ఆలోచనలకు పదును పెట్టి పాలనాపరమైన అంశాల్లో చురుగ్గా వ్యవహరించారన్న గుర్తింపు ఉంది. అలా చురుగ్గా వ్యవహరించిన వాటిలో కొన్నింటికి ప్రస్తుతం సంజాయిషీ చెప్పుకోవాల్సి రావడం ఆయన స్పీడ్‌కు బ్రేక్‌లు పడినట్లైంది. వైసీపీ ప్రభుత్వంలో అండదండలందించిన ఓ మంత్రి ప్రస్తుతం అధికార పార్టీలో కూడా ప్రజాప్రతినిధిగా ఉన్నారు. దీంతో మనకేమి ఇబ్బంది ఉండదని డీపీఓ భావించారు. అయితే అప్పటి మంత్రి పాచికలు ప్రస్తుత ప్రభుత్వంలో పారకపోవడంతో ఆయన అనుయాయులకు ఇబ్బందులు తప్పడం లేదు. కర్నూలు డీపీఓగా ఉన్న సమయంలో జరిగిన తప్పిదాలకు సంబంధించి నెలలో రెండు రోజులు సంజాయిషీ ఇచ్చుకోవడానికి వెళ్లాల్సి రావడం, ఇక్కడి ప్రజా ప్రతినిధుల సహకారం లేకపోవడంతో డీపీఓ నాగరాజనాయుడు ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నట్లు సమాచారం.

డీపీఓకు బదిలీ భయం



ఉద్యోగోన్నతుల ప్రక్రియలో స్థానిక ప్రజాప్రతినిధుల మాట చెల్లుబాటు కాకపోతే డీపీఓపై భారీగా వ్యతిరేకత పెరిగే అవకాశం ఉంది. ఒక వేళ వారి సిఫార్సులు మన్నిస్తే కోర్టు కేసులు ఎదుర్కొనే ప్రమాదం ఉంది. ఇప్పటికే డీపీఓను మార్చాలని పెద్ద ఎత్తున ఒత్తిళ్లు ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. బదిలీకి బలమైన కారణం లేకపోవడంతో ఆయన సేఫ్‌గా ఉన్నారు. బదిలీల ప్రక్రియలో చిన్న లోపం దొర్లినా దాన్ని సాకుగా చూపి సాగనంపే అవకాశం ఉందన్న చర్చ జరుగుతోంది. దీంతో డీపీఓ జాగ్రత్త పడుతున్నట్లు సమాచారం.

గ్రేడ్లు.. ఉద్యోగులు.. ఖాళీలు ఇలా..

ప్రస్తుతం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రేడ్-5 ప్రమోషన్లు చేపట్టేందుకు అధికారులు అడుగులు వేస్తున్నారు. అయితే గ్రేడ్-3, గ్రేడ్-4 కార్యదర్శులకు ప్రమోషన్లు కల్పించిన తరువాతే గ్రేడ్-5 కార్యదర్శులకు ఉద్యోగోన్నతులు కల్పించే అవకాశం ఉంది. అలా కాకుండా గ్రేడ్-5 కార్యదర్శుల ఉద్యోగోన్నతులకు శ్రీకారం చుడితే ఖాళీ అయ్యే స్థానాలను ఎప్పుడు భర్తీ చేస్తారో తెలియని పరిస్థితి. గ్రేడ్ల వారిగా ఖాళీలను పరిశీలిస్తే ఉమ్మడి జిల్లాలో 49 మంది గ్రేడ్-1 కార్యదర్శులు ఉండాల్సి ఉండగా 43 మంది ఉన్నారు. గ్రేడ్-2 కార్యదర్శుల్లో అర్హులకు ఉద్యోగోన్నతి కల్పిస్తే గ్రేడ్-2 ఖాళీలు మరింత పెరిగే అవకాశం ఉంది. అయితే అధికారులు వీటిని పట్టించుకోవడం లేదు. గ్రేడ్-2 కార్యదర్శులు 18 మంది ఉండాల్సి ఉండగా నలుగురు మాత్రమే ఉన్నారు. ఇందుకు కొన్నేళ్లుగా గ్రేడ్-3 కార్యదర్శులకు ఉద్యోగోన్నతులు కల్పించకపోవడమే కారణమని తెలిసింది. గ్రేడ్-3 కార్యదర్శులు 115 మంది ఉండాల్సి ఉండగా అందరూ ఉన్నారు. దీంతో వీరు ఏళ్లుగా ఎటువంటి ప్రమోషన్లు లేకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడ అన్న చందంగా ఉన్నారు. గ్రేడ్-4 కార్యదర్శులకు ఎనిమిదేళ్లుగా ప్రమోషన్లు లేవంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. వీరు 441 మంది ఉండాల్సి ఉండగా 333 మంది మాత్రమే ఉన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో నియమితులైన గ్రేడ్-5 కార్యదర్శులకు ప్రమోషన్ కల్పించి ఈ ఖాళీలు భర్తీ చేయడానికి శ్రీకారం చుట్టనున్నారు.

ర్యాంకులా.. ప్రొబేషన్ ఖరారా?

గ్రేడ్-5 కార్యదర్శులకు సంబంధించి ప్రమోషన్ల ప్రక్రియకు శ్రీకారం చుడుతుండటంతో ఇందులో పలు అపోహలు కలుగుతున్నాయి. ఉద్యోగం పొందినప్పటి ప్రతిభకు ఆధారంగా వచ్చిన ర్యాంకును పరిగణలోకి తీసుకుంటారా..? లేదా రెండేళ్ల సర్వీస్ పూర్తి చేసుకొని ప్రొబేషన్ ఖరారు చేసుకున్నవారికి ప్రాధాన్యం ఇస్తారా అన్న చర్చ జరుగుతోంది. ఇందులో అందరికి కాకపోయిన కొంత మంది దగ్గర సమస్యలు తలేత్తే అవకాశం ఉంది. ప్రతిభకు అనుగుణంగా ర్యాంకుల వారిగా ఉద్యోగాలు పొందినప్పటికీ ఉద్యోగంలో చేరడానికి ఆసక్తి లేక అనివార్య కారణాలతో ఆలస్యంగా ఉద్యోగంలో చేరిన వారు ఉన్నారు. ఉద్యోగంలో చేరి ఇక్కడ నచ్చక తిరిగి ఎలాంటి సమాచారం లేకుండా పోయి తిరిగి వచ్చిన వారు ఉన్నారు. ఇలాంటి వారికి ప్రొబేషన్ ఖరారులో ఆలస్యం అయింది. దీంతో ఏ ప్రతిపాదికన ఉద్యోగోన్నతులు కల్పిస్తారన్న చర్చ జరుగుతోంది.

జాతీయ హాకీ అకాడమీకి

సనప విద్యార్థిని



జాతీయ హాకీ అకాడమీకి ఎంపికైన లక్ష్మి

ఆత్మకూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని సనప గ్రామానికి చెందిన విద్యార్థిని లక్ష్మి జాతీయస్థాయి హాకీ అకాడమీకి ఎంపికైంది. తమ పాఠశాల పూర్వ విద్యార్థిని ఈ ఘనత సాధించడం పట్ల సనప ఉన్నత పాఠశాల పీడీ నాగరాజు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు. విద్యార్థిని లక్ష్మి జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ కనబరిచిందన్నారు. ప్రస్తుతం కర్ణాటకలోని వడికెర స్పోర్ట్స్ అథారిటీలో శిక్షణ పొందుతున్నట్లు తెలిపారు. విద్యార్థిని తల్లి శివమ్మ ఆశావర్కర్, తండ్రి పోతులయ్య కూలి పనులకు వెళ్తుంటారన్నారు. తమ కూతురు జాతీయ అకాడమీకి ఎంపికవడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేశారు. అకాడమీలో శిక్షణ పొందిన వారు జాతీయ జట్టులో స్థానం సంపాదిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థినిని టీచర్లు, గ్రామస్థులు అభినందించారు.

కార్మిక సమస్యలపై ప్రభుత్వం

నిర్లక్ష్యం

వేతన, పీఎఫ్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప

కళ్యాణదుర్గం రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప విమర్శించారు. పట్టణంలోని శ్రీరామిరెడ్డి తాగునీటి పంపుహౌస్ వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్మికుల సమ్మె మంగళవారం పదో రోజుకు చేరుకుంది. సమ్మెకు నల్లప్ప మద్దతు తెలిపారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో అనేక గ్రామాలకు తాగునీరు అందిస్తున్న శ్రీరామిరెడ్డి పథకానికి నిధులు మంజూరు చేయకపోవడం, కార్మికులకు ఆరు నెలలుగా వేతనాలివ్వకపోవడం సరికాదన్నారు. ఇప్పటికైనా కార్మికులకు వేతనాలు, పీఎఫ్ బకాయిలను వెంటనే చెల్లించి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కార్మికుల పక్షాన సీపీఎం ఆందోళనలు చేపడుతుందన్నారు. సమ్మెకు ఎస్సీ, ఎస్టీ జేఏసీ తాలుకా అధ్యక్షుడు చెలిమప్ప మద్దతు తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు నాగమణి, సహాయ కార్యదర్శి అచ్యుత్‌ప్రసాద్, మండల అధ్యక్షుడు రంగనాథ్, శ్రీరామిరెడ్డి కార్మిక నాయకులు వన్నూరుస్వామి, అల్లాబకాష్, గంగాధర, నరేష్, హనుమంతరెడ్డి పాల్గొన్నారు.

నేటి ప్రముఖులు

పోర్ట్రైట్ ఆర్టిస్ట్ కే.శే. శంకరనారాయణ కామ్...

కందుకూరి వీరేశలింగం పంతులు (జయంతి)



తెలుగునాట గొప్ప సంఘ సంస్కర్తగా పేరొందిన కందుకూరి వీరేశలింగం పంతులు 1848 ఏప్రిల్ 16న తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రిలో జన్మించారు. రచయితగా, ఆధునికాంధ్ర సమాజ పితామహుడిగా కీర్తి గడించారు. స్త్రీ విద్యకోసం విశేషకృషి చేశారు. యువజనసంఘాల స్థాపన ఆయనతోనే మొదలైంది. హితకారిణి అనే ధర్మసంస్థను స్థాపించి తన యావదాస్తిని ఇచ్చేశాడు. మూడు దశాబ్దాలపాటు తెలుగు పండితుడిగా పనిచేశారు. 130కు పైగా గ్రంథాలు రాశారు. అనేక ఆంగ్ల, సంస్కృత గ్రంథా లను తెలుగులోకి అనువదించారు. ఆధునిక తెలుగు నాటక రంగంలో తొలి నాటకకర్త, దర్శకుడు, ప్రదర్శన కారుడైన ఆయన పుట్టినరోజును తెలుగు నాటక రంగ దినోత్సవంగా నిర్ణయించారు. రావు బహద్దూర్ బిరుదు పొందారు. 1919 మే 27న కన్నుమూశారు.

చార్లీ చాప్లిన్ (జయంతి)



చార్లీచాప్లిన్ 1889 ఏప్రిల్ 16న ఇంగ్లండ్ దేశంలో జన్మించారు. తల్లిదండ్రులు ఇరువురు వృత్తి రీత్యా నటులు. మూడేళ్ల వయసులోనే మిమిక్రీలో ప్రతిభ చాటారు. అనేక కళల్లో నిష్ణాతుడైన ఒక ప్రసిద్ధ బహురూపి, అమాయకుడిలా తెరమీద కనిపించే చాప్లిన్, నిజానికి చాలా చక్కనివాడు, అందగాడు, ఆశ్చర్యాన్ని గొలిపే రచయిత. చక్కటి గాయకుడు. యుద్ధాన్ని నిరంతరం విమర్శించే శాంతి ప్రియుడు. ఒక్కమాటలో చెప్పాలంటే ప్రపంచ అద్భుతాల్లో ఒకడు. మూకీ సినిమాల చక్రవర్తిగా అభివర్ణించబడ్డారు. ఆయన వేషధారణ విచిత్రంగా ఉంటూ అందరినీ ఆకట్టుకునేది. 1910-30 దశకాలలో అత్యధిక రెమ్యూనరేషన్ అందుకున్న నటుడు. 1977 డిసెంబరు 25న కన్నుమూశారు.

బిరుదురాజు రామరాజు (జయంతి)



జానపద సాహిత్యంపై విశేషకృషి చేసిన రచయిత బిరుదురాజు రామరాజు 1925 ఏప్రిల్ 16న హనుమకొండ జిల్లా దేవనూరు గ్రామంలో జన్మించారు. యువ నాయకులతో కలసి రజాకార్ల ఉద్యమం, స్టేట్‌కాంగ్రెస్ ఉద్యమాలలో పాల్గొని 1947లో మూడు నెలలపాటు కారాగారశిక్ష అనుభవించారు. ఆంధ్ర రచయితల సంఘానికి తొలి కార్యదర్శి. దక్షిణ భారతదేశంలోనే జానపద సాహిత్యంపై మొట్టమొదటి పీహెచ్‌డీ ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి అందుకున్నారు. అంచెలంచెలుగా తెలుగుశాఖ డీన్‌గా, అధ్యక్షుడిగా ఎదిగారు. గౌరవ డాక్టరేట్ సహా రాజాలక్ష్మి పురస్కారం, సీపీ బ్రౌన్ అకాడమీవారి తెలుగుభారతి పురస్కారం అందుకున్నారు. ఆయన మార్గదర్శకంలో 37మంది పీహెచ్‌డీ పొందారు. 2010 ఫిబ్రవరి 8న కన్నుమూశారు.

పోప్ బెనెడిక్ట్ (జయంతి)



క్యాథలిక్ చర్చ్ హెడ్‌గా వ్యవహరించిన పోప్ బెనెడిక్ట్-16 1927 ఏప్రిల్ 16న జర్మనీదేశంలో జన్మించారు. వ్యాటికన్ సిటీ కేంద్రంగా క్రైస్తవమతబోధకుడిగా పేరొందారు. డీన్ ఆఫ్ ది కాలేజ్ ఆఫ్ ఆర్డినల్స్, ప్రెసిడెంట్ ఆఫ్ ది పొంటిఫికల్ బిబ్లికల్ కమిషన్, ఆర్చ్ బిషప్ ఆఫ్ మ్యూనిచ్ అండ్ ఫ్రిజింగ్ తదితర హోదాలలో కొనసాగారు. 66 పుస్తకాలు, ఇతర రచనలు చేశారు. 2022 డిసెంబరు 31న కన్నుమూశారు.

ఎంఎస్ నారాయణ (జయంతి)



ప్రముఖ తెలుగు హాస్యనటుడు, దర్శకుడు, రచయిత మైలవరపు సూర్య (ఎంఎస్) నారాయణ 1947 ఏప్రిల్ 16న పశ్చిమ గోదావరి జిల్లా నిడమర్రులో జన్మించారు. చదువుకునే రోజులనుంచే హాస్య రచనలు చేసేవారు. కొన్ని నాటకాలు రాశారు. దర్శకుడు రవిరాజా పినిశెట్టి వద్ద కొంతకాలం రచయితగా పనిచేశారు. 'మా నాన్నకి పెళ్ళి' సినిమాలో తాగుబోతు పాత్ర గుర్తింపు తెచ్చింది. ఉత్తమ కమెడియన్‌గా 5 నంది అవార్డులు అందుకున్నారు. తర్వాత కొడుకు, భజంత్రీలు చిత్రాలకు దర్శకత్వం వహించారు. అనారోగ్యంతో 2015 జనవరి 23న హైదరాబాద్‌లో కన్నుమూశారు.

ఎస్ సౌమ్య (పుట్టినరోజు)



ఎస్ సౌమ్య 1969 ఏప్రిల్ 16న జన్మించారు. కర్ణాటక సంగీత గాయని. మద్రాస్ మ్యూజిక్ అకాడమీలో మూడు దశాబ్దాలకుపైగా ప్రదర్శనలు ఇచ్చారు. సంగీత కళానిధి, సంగీత చూడామణి, సంగీత కళా సారథి, విద్యా తపస్వి, సంగీత రత్నాకర తదితర అవార్డులు అందుకున్నారు. తమిళనాడులోని జయలలిత మ్యూజిక్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీకి వైస్ చాన్స్‌లర్‌గా వ్యవహరిస్తున్నారు.

18న దివ్యాంగుల క్రికెట్ సెలెక్షన్స్

అనంతపురం క్లాక్‌టవర్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగ క్రీడాకారుల ఎంపిక పోటీలు ఈనెల 18న ఆర్టీటీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా దివ్యాంగుల క్రికెట్ సంఘం అధ్యక్షుడు శంకరనారాయణ తెలిపారు. ఆసక్తి, అర్హతగల దివ్యాంగ క్రీడాకారులు ఆధార్‌కార్డు, రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సదరం సర్టిఫికెట్, యూనిఫాం, క్రీడాసామగ్రితో హాజరుకావాలన్నారు. వివరాలు, పేర్ల నమోదుకు సెల్ నంబర్లు 9703400870, 6305354511, 9398509469లను సంప్రదించాలని కోరారు. ఎంపికైన దివ్యాంగ క్రీడాకారులు రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు.

చీనీ టన్ను రూ.22 వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో మంగళవారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ.22,560 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 774 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

శ్రీరామరెడ్డి సేవలు చిరస్మరణీయం



శ్రీరామరెడ్డి విగ్రహం వద్ద అభిమానులు, కార్యకర్తలు

బాగేపల్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): సీపీఎం నేత, మాజీ ఎమ్మెల్యే శ్రీరామరెడ్డి నియోజకవర్గానికి చేసిన సేవలు చిరస్మరణీయమని వక్తలు పేర్కొన్నారు. పట్టణంలో శ్రీరామరెడ్డి వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. సీపీఎం రాష్ట్ర కార్యవర్గమండలి సభ్యుడు మునివెంకటప్ప మాట్లాడుతూ జాతీయస్థాయిలో దూరదృష్టి కలిగిన నేత శ్రీరామరెడ్డి అన్నారు. కూలి కార్మికులు, రైతులు, మహిళల సంక్షేమం కోసం నిరంతరం పోరాటాలు చేశారని, భూమిలేని వారికోసం పాటుపడ్డారన్నారు. ప్రభుత్వ పాఠశాల, కళాశాల, ఆసుపత్రులు, చిత్రావతి డ్యాం, వండమాన్ డ్యాంలు నిర్మాణం తో పాటు పట్టణంలో రోడ్ల విస్తరణ వంటి అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. తొలుత శ్రీరామరెడ్డి విగ్రహానికి, చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం అన్నసంతర్పణ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రఘురామరెడ్డి, చన్నరాయప్ప, అశ్వత్థప్ప, గోవర్ధనాచారి, రఫీక్, ముస్తఫా, చలపతి, కృష్ణప్ప, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గుడిబండ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

నిత్యావసర ధరల నియంత్రణకు చట్టాలు చేయండి



రైల్వేస్టేషన్ వద్ద వివిధ పండ్లతో రైతుల నిరసన

బంగారపేట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు అవసరమైన చట్టాలు రూపొందించాలని, ఆగి పోయిన నబార్డు వ్యవసాయ రుణాలను కొన సాగించాలని, నరేగా పనులలో అవినీతి నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరుతూ రైతుసంఘం ఆధ్వర్యంలో రైల్వేస్టేషన్ వద్ద నిరసన చేపట్టారు. రైతు సంఘం ఉపాధ్యక్షుడు కే నారాయణగౌడ మాట్లాడుతూ సహకార బ్యాంకు లలో రుణాలు లభించక, పండించిన పంటలకు గిట్టుబాటు ధర లభించక, నరేగాలలో పనులు లభించక రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నా రన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పథకాలకోసం నిత్యావసరాలైన వంట నూనె, బేడలు, డీజిల్, వంటగ్యాస్, వాణిజ్యవాహనాలకు పన్ను తదితర అన్ని రకాల వస్తువులపై ధరలు పెంచి సామాన్య మధ్యతరగతి వర్గాల ప్రజలతో ఆడుకుంటున్నా రని మండిపడ్డారు. నిరసనలో రైతుసంఘం జిల్లాధ్యక్షుడు ఈకంబళ్ళి మంజునాథ్, అప్పోజి రావ్, లక్ష్మణ్, కిరణ్, చాంద్ పాష, బాబాజాన్, మహిళా రైతులు, స్థానిక ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

స్నేహితుడిని స్మరించుకున్న మంత్రి సుధాకర్



కల్యాణమండపాన్ని పరిశీలిస్తున్న మంత్రి సుధాకర్ తదితరులు

శిడ్లఘట్ట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పర్యావరణప్రేమి బెళ్ళూటి సంతోష్ తొలి వర్ధంతి సందర్భంగా చిక్కబళ్ళాపుర జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి ఎంసీ సుధాకర్ పాల్గొని పుష్పాంజలి ఘటించి గౌరవం సమర్పించారు. తొలుత గుట్టాంజనేయస్వామి కల్యాణమండపాన్ని సందర్శించారు. కల్యాణమండపం అభివృద్ధిపై హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ ఎప్పుడూ చిరునవ్వుతో ఉండే బెళ్ళూటి సంతోష్ మనల్ని వీడి ఏడాది అయ్యిందన్నారు. సంతోష్‌తో తమ స్నేహబంధం 20ఏళ్ల అని, తనను టైగర్ అని పిలిచేవారంటూ గుర్తు చేసుకున్నారు. కాంగ్రెస్ నాయకుడు పుట్టు ఆంజినప్ప మాట్లాడుతూ బెళ్ళూటి సంతోష్, తాను బాల్య స్నేహితులమన్నారు. కాంగ్రెస్ పార్టీకోసం ఎంతో కృషి చేశారన్నారు. బెళ్ళూటి గ్రామానికి మౌలిక సదుపాయాల కల్పనకు పాటుపడ్డారన్నారు. ఎన్నో సమాజ సేవా కార్యక్రమాలు చేసిన సంతోష్ తమకు అందనంత దూరం వెళ్లారన్నారు. అయితే అతడు కన్న కలలను సాకారం చేసేందుకు తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఈ సందర్భంగా బెళ్ళూటి సంతోష్, బోదగూరు సురేశ్, ప్రకాశ్, మునియప్ప, గోపాలప్ప, పీఎల్‌డీ బ్యాంకు డైరెక్టర్ చంద్రు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు.. అంబేడ్కర్



సర్జాపురలో అంబేడ్కర్ ముత్యాలపల్లకి ఉత్సవం

దొమ్మసంద్ర, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): దేశ ఆర్థికవేత్త, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆదర్శప్రాయులని సర్జాపుర గ్రామపంచాయతీ మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత సభ్యుడు ఎస్ఎం శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు. సర్జాపుర గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ఏర్పాటైన 134వ అంబేడ్కర్ జయంతి సందర్భంగా ముత్యాలపల్లకీని ప్రారంభించి మాట్లాడారు. దేశ సుభద్రతకు ఆర్థికత దృష్ట్యా ప్రజలందరి సమానత్వం ఆకాంక్షిస్తూ రాజ్యాంగాన్ని రూపొందించిన మహానేత అంబేడ్కర్ అన్నారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ అధ్యక్షురాలు మమత రమేశ్, ఉపాధ్యక్షులు ఓంశక్తి మంజునాథ్, మాజీ అధ్యక్షుడు ఎస్‌వీ శ్రీనివాస్ బుడగప్ప, సభ్యులు లలితమ్మ, ఆక్టర్ ఎస్ మంజునాథ్ సర్జా, ఏ సతీశ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

12 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న బియ్యం బస్తాలతో అధికారులు, సిబ్బంది

కంప్లి/సిరుగుప్ప, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కొత్తూరు హరప్పనహళ్లి రోడ్డు కే అయ్యనహళ్లి గ్రామంలో మంగళవారం టాటా ఏస్ వాహనంలో అక్రమంగా రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా అధికారులు దాడి చేశారు. నిందితులు షబ్బీర్, జందూసాబ్, మంజునాథ్ 20 బస్తాల్లో బియ్యం, 740 కిలోల బియ్యాన్ని తీసుకెళుతుండగా పీఎస్ఐ గీతాంజలి ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మంజునాథ ఆధ్వర్యంలో దాడి చేశారు. రూ.70 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. కొత్తూరు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అలాగే సిరుగుప్ప, టెక్కలికోట పరిధిలోని తాళూరు గ్రామంలోని ఈరణ్ణ దేవాలయం దగ్గర అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని ఆహార శాఖ సిబ్బంది, పోలీసులు పట్టుకున్నారు. పక్కా సమాచారం మేరకు సిరుగుప్ప ఫుడ్ ఇన్‌స్పెక్టర్ మహారుద్ర గౌడ్, శిరిగేరి పోలీస్‌స్టేషన్ పీఎస్ఐ సద్దాం హుస్సేన్ నేతృత్వంలోని బృందం దాడి చేసి 25 బస్తాల్లో ఉన్న రూ. 27600 విలువ చేసే 12 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు.

జొన్న కొనుగోలు జాప్యంపై రైతుల నిరసన

రాయచూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి) : జొన్నల కొనుగోలు కేంద్రాల్లో జరుగుతున్న జాప్యాన్ని నిరశిస్తు రైతులు మంగళవారం రాస్తారోకో చేపట్టారు.



రోడ్డుపై బైఠాయించిన రైతులు

జిల్లాలోని సింధనూరు తాలూకా పోత్నాళ్ వద్ద రాష్ట్ర రహదారి పై కర్ణాటక రైతు సంఘం, హసిరుసేనల ఆధ్వర్యంలో రైతులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి రోడ్డు పై బైఠాయించారు. కొనుగోలు కేంద్రాల్లో జొన్నల కల్లాలు జరిగి రెండు నెలలు దాటుతున్నా ఇప్పటి వరకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారంటు రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే సమయంలో తాలూకాలోని శిరనగుడి వద్ద అక్రమంగా సాగుతున్న మైనింగ్ వ్యవహారాల పై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించడం లేదంటు ఆరోపించారు. కాలువలకు సమీపంలో మైనింగ్ ఉండరాదని నిబంధనలు ఉన్నా వాటిని ఖాతరు చేయకుండా పెద్ద ఎత్తున మైనింగ్ జరుపుతున్నారని దీని పై అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కాగా, రాయచూరు-సింధనూరు ప్రధాన రహదారి పోత్నాళ్ వద్ద రైతులు రోడ్డు పై బైఠాయించడంతో దాదాపు గంటలకు పైగా ఈ మార్గంలో వాహన సంచారానికి తీవ్ర అంతరాయం ఏర్పడింది. అనంతరం రంగ ప్రవేశం చేసిన పోలీసులు రైతులను శాంతిప చేసి ధర్నా విరమింపచేశారు.

వక్ఫ్ సవరణ బిల్లుకు వ్యతిరేకంగా ధర్నా



దేవదుర్గలో భారీ ర్యాలీ చేపట్టిన ముస్లింలు

రాయచూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని దేవదుర్గ పట్టణంలో కేంద్ర ప్రభుత్వం ఇటీవల వక్ఫ్ చట్టానికి సవరణ తీసుకోరావడాన్ని నిరశిస్తు ముస్లింలు మంగళవారం ధర్నాకు దిగారు. దేవదుర్గలో ప్రధాన రహదారిల్లో ర్యాలీ నిర్వహించిన ముస్లింలు కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను వ్యతిరేకిస్తు నినాదాలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన నాయకులు వక్ఫ్ చట్టానికి సవరణలు తీసుకోరావడం వల్ల ముస్లింల హక్కులను హరించిందని కేంద్ర ప్రభుత్వం పై ధ్వజమెత్తారు. ముస్లింల హక్కులను హరించిందని కేంద్ర ప్రభుత్వం పై ధ్వజమెత్తారు. బీజేపీ కేంద్రంలో అధికారం చేపట్టిన నాటి నుంచి మైనార్టీల పట్ల ముఖ్యంగా ముస్లింల పట్ల వ్యతిరేఖ ధోరణిని అవలంభిస్తుండడం గర్హనీయమన్నారు. వక్ఫ్ ఆస్తులకు రక్షణ లేకుండా చేసి చట్టపరంగా వాటిని కాచేసే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. కేంద్ర ప్రభుత్వం బిల్లును పార్లిమెంట్‌లో ఆమోదించేందుకు ప్రతిపక్షాల పై అనేక రకాల ఒత్తిడి తీసుకొస్తుండడం ప్రజాస్వామ్య విధానాలకు వ్యతిరేకమన్నారు. వెంటనే ప్రభుత్వం బిల్లును ఉపసంహరించుకోవాలని ఆ చట్టం అమలు కాకుండా చూడాలని డిమాండ్ చేశారు.

గడ్డి వాముల దగ్ధం



దగ్ధమవుతున్న గడ్డివాములు

రాయచూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అరకేరా తాలూకా ముమ్మనమరడి గ్రామ సమీపంలో సోమవారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో రెండు విలువైన గడ్డివాములు దగ్ధమైయ్యాయి. గ్రామానికి చెందిన రైతు హనుమంతరాయకు చెందిన వరిగడ్డి వాము, జొన్నసొప్పతో కూడిన రెండు వాములు ప్రమాదవశాత్తు కాలిపోయాయి. విషయాన్ని ఫోన్ ద్వారా అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇవ్వగా అక్కడికి చేరుకున్న సిబ్బంది మంటలార్పే ప్రయత్నం చేశారు. అప్పటికే దాదాపు 90 శాతం మేరకు వాములు కాలిపోయినట్లు గ్రామస్థులు తెలిపారు. కాగా లక్షలు విలువ చేసే రెండు గడ్డివాములు దగ్ధం కావడంతో పాటు పశువుల మేత కరువైన నేపథ్యంలో రైతును ప్రభుత్వం ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు కోరారు.

నేడు చౌడేశ్వరీదేవి జ్యోతుల ఉత్సవం



అలంకరణలో చౌడేశ్వరీదేవి

చేళూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చేళూరు తాలూకా సరిహద్దులోగల అమడగూరులోని పురాతనమైన చౌడేశ్వరి అమ్మవారి ఆలయ జ్యోతి ఉత్సవంలో ప్రధానఘట్ట ఈనెల 16న జరగనుంది. చైత్ర పున్నమికి ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. సరిహద్దు ప్రాంతం కావడంతో కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ భక్తులు పాల్గొననున్నారు. ఇక్కడ అమ్మవారు భక్తుల కొంగుబంగారంగా ప్రసిద్ధి చెందారు. తమిళనాడులోని కృష్ణగిరి జిల్లా డెంకణీకోట ప్రాంతంనుంచి పెద్దసంఖ్యలో ఇక్కడికి జ్యోతి ఉత్సవంలో పాల్గొనేందుకు వస్తుంటారు. బుధవారం సాయంత్రం ఉత్సవ మూర్తిని రథంపై కొలువుదీర్చి పురవీధులలో ఊరేగించనున్నారు. ఈ సందర్భంగా భక్తులు జ్యోతులను తలపై పెట్టుకుని ఊరేగింపులో పాల్గొంటారు. జ్యోతి ఉత్సవాన్ని వీక్షించేందుకు వేలాదిమంది తరలి రానున్నారు. ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు ఆలయ ధర్మకర్త పురుషోత్తమరెడ్డి తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారికి విశేషపూజలు నిర్వహించారు.

వాల్మీకి మహర్షి విగ్రహావిష్కరణ



నూతన వాల్మీకి విగ్రహం

చేళూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): చేళూరు తాలూకా చిలకలనేర్పు గ్రామ పంచాయతీకేంద్రంలో వీరాంజనేయస్వామి ఉత్సవాల్లో భాగంగా స్థానిక మారుతి మహర్షి వాల్మీకి అభివృద్ధి సంఘం ఆధ్వర్యంలో ఆలయ సమీపాన మహర్షి వాల్మీకి విగ్రహాన్ని స్థాపించారు. రాజహళ్ళిగురుపీఠం స్వామిజీ పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. స్వామిజీ మాట్లాడుతూ మహర్షి వాల్మీకి ఒక వర్గం, ఒక మతానికి పరిమితం కాలేదని అందుకే ఆయన ఆదికవిగా అందరి ఆదరణ పొందారన్నారు. వాల్మీకి మహర్షి రచించిన రామాయణం ఎంతో ప్రసిద్ధి చెందిందన్నారు. అంబికా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ వాల్మీకి సామాజికవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. బీజేపీ నాయకుడు గుంజూరు శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ వాల్మీకి కులస్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామన్నారు. కార్యక్రమంలో కోలారుకు చెందిన మహేశ్‌బాబు, రవికుమార్, మాజీ మంత్రి కృష్ణారెడ్డి, గ్రామపంచాయతీ అధ్యక్షుడు ప్రసాద్, ఉపాధ్యక్షులు భాగ్యమ్మ, మారుతిసంఘానికి చెందిన రామాంజి, మంజునాథ్ తదితరులు పాల్గొన్నారు.


జయంతులను ఘనంగా ఆచరిద్దాం

సిరుగుప్ప, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మహనీయుల జయంతులను ఘనంగా ఆచరిద్దామని తహసీల్దార్ విశ్వనాథ్ పిలుపునిచ్చారు. మంగళవారం సిరుగుప్ప పట్టణం తహసీల్దార్ కార్యాలయంలో 30వ తేదీ బసవ జయంతి, మే 2న శంకరా చార్యుల జయంతిని ఆచరించడంపై సన్నాహక సభ జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ ముందు రోజుల్లో అన్ని జయంతులను ఘనంగా ఆచరించేందుకు సిద్దత సమావేశం ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా బీసీ సంక్షేమ శాఖ డైరెక్టర్ మల్లికార్జున, సాంఘీక సంక్షేమ శాఖ డైరెక్టర్ సిద్దయ్య, శిశు అభివృద్ధి యోజన అధికారి ప్రదీప్, వీరశైవ సమాజం ప్రముఖులు, పదాధికారులు ప్రజలు పాల్గొన్నారు

పొగాకు రైతులకు దళారీ మోసం

- పంట కొంటానని హామీ...
- బాపట్లకు వెళ్లాక చేతులెత్తేసిన వైనం
- ధర్నాకు దిగిన అన్నదాతలు

పెద్దవడుగూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): దళారీ మాటలు నమ్మి వెళ్లిన రైతులు నాలుగు రోజులపాటు పడిగాపులు కాయాల్సి వచ్చింది. మండలంలోని లక్ష్మీపల్లికి చెందిన కొందరు రైతులు పొగాకు దిగుబడిని విక్రయించేందుకు బాపట్ల జిల్లా మేదరమట్ల గ్రామానికి చెందిన హరిబాబు అనే వ్యక్తికి ఫోన్ చేశారు. కొనుగోలు చేస్తానని అతడు చెప్పాడు. దీంతో పదిమంది రైతులు నాలుగు రోజుల క్రితం 50 వాహనాల్లో పొగాకు తరలించారు. రోజులు గడుస్తున్నా హరిబాబు కొనుగోలు చేయకపోవడంతో ఆందోళన చెందిన రైతులు ధర్నాకు దిగారు. జిల్లా యంత్రాంగం స్పందించి, పొగాకు కొనుగోలు చేస్తామని హామీ ఇవ్వడంతో శాంతించారు. బుధవారం కొనుగోలు చేస్తామని అధికారులు చెప్పినట్లు రైతులు తెలిపారు. నాలుగు రోజులుగా లాడ్జీలో ఉండడానికి, భోజనం తదితరాలు వేల రూపాయలు ఖర్చయినట్లు రైతులు తెలిపారు.



తుంగభద్ర నీటి మట్టం : 1633 అడుగులు

	ప్రస్తుతం	గత ఏడాది
నీటి మట్టం (అడుగులు)	1584.67	1,578.88
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	411	0
ఔట్ ఫ్లో (క్యూసెక్కులు)	839	162
నీటి నిల్వ (టీఎంసీలు)	7.11	3.95



చలవాది గేరి కమాన్ వద్ద ప్రమాదకరంగా చాంబర్

ప్రమాదకరంగా యూజీడీ చాంబర్లు

బళ్లారి గాంధీనగర్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని ప్రధాన రహదారుల్లో నిర్మించిన యూజీడీ చాంబర్లు ప్రమాదకరంగా తయారయ్యాయి. నాణ్యత లోపించడంతో కొద్ది రోజుల్లోకే నోళ్ళుతెరుచుని ప్రమాదాలకు ఆహ్వానం పలుకుతున్నాయి. నగరంలోని 7వ డివిజన్ పరిధిలోని చలవాది గేరి కమాన్ వద్ద నిర్మాణమైన చాంబర్లు దుస్థితికి చేరుకున్నాయి. తరచూ ఇక్కడ ప్రమాదాలు జరుగుతున్నా స్థానిక కార్పొరేటర్ పట్టించుకోవడం లేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. చాంబర్ మూత కూలిపోవడంతో వాహనదారులు ఇబ్బంది పడు తున్నారు. స్థానిక ప్రజలే ప్రమాదాలు జరగకుండా మ్యాన్‌హోల్‌ను పెద్దపెద్ద రాళ్ళతో మూసి వేసి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్త పడుతున్నారు. ఈ విషయంపై స్థానిక కార్పొరేషన్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టాలని వార్డు ప్రజలు కోరుతున్నారు.

విమాన ప్రవేశ పరీక్ష..!

విమాన ప్రయాణ అవకానికి పరీక్షలు



ప్రవేశ పరీక్ష రాస్తున్న విద్యార్థులు

గంగావతి రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): తాలూకాలోని బహద్దూరబండి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీరప్ప తన సొంత ఖర్చులతో 24మంది విద్యార్థులను విమానంలో హైదరాబాద్‌కు తీసుకెళ్తున్నారు. విద్యార్థులను ఎంపిక చేయడానికి 5నుండి 8వ తరగతివ వరకు పిల్లలకు రాత పరీక్ష మంగళవారం నిర్వహించారు. పరీక్ష పారదర్శకంగా జరిగేలా చూసేందుకు తాలూకాలోని హట్టి ముందరగి పాఠశాలలో ఉపాధ్యాయుడైన అలీ స్వయంగా ప్రశ్నపత్రాన్ని తయారు చేశారు. 5నుండి 8వ తరగతివరకు పరీక్షలో బాగారాణించిన ఆరుగురు విద్యార్థులను విమానంలో తీసుకెళ్తారు. పిల్లల్లో పఠనాసక్తి, పోటీతత్వ స్ఫూర్తిని పెంపొందించడానికి రాత పరీక్షలో మంచి మార్కులు సాధించిన వారిని విమానంలో తీసుకెళ్లనున్నట్లు బీరప్ప అన్నారు.

కన్నడ ప్రాబల్యాన్ని పెంచేందుకే సాహిత్య సదస్సు

● డిసెంబరులో బళ్లారిలో 88వ అఖిల భారత సదస్సు: కసాప రాష్ట్ర అధ్యక్షుడు మహేష్ జోషి

బళ్లారి సిటీ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): డిశంబర్‌లో 88వ అఖిల భారత కన్నడ సాహిత్య సదస్సు బళ్లారిలో జరగనుందని, కన్నడ ప్రాచుర్యాన్ని పెంపొందించడానికి అందరమూ సిద్ధంగా ఉండాలని కసాప రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ మహేశ్ జోషి పిలుపునిచ్చారు. మంగళవారం నగరంలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం కేశ్వన్ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో 88వ అఖిల భారత కన్నడ సాహిత్య సదస్సుపై జరిగిన ప్రాథమిక సమావేశంలో ఆయన మాట్లాడారు. కన్నడ సాహిత్య సమావేశాలు సాహిత్య ప్రియులకు విందు లాంటివన్నారు. కన్నడ చరిత్రను ప్రోత్సహించడం, భాషను అభివృద్ధి చేయడం ఈసమావేశం యొక్క ప్రధాన లక్ష్యమన్నారు. ప్రధానంగా సమవేశాల్లో కన్నడ భాష , భాషాభివృద్ధి , సరిహద్దు ప్రాంతాల్లోని పాఠశాలల సమస్యలకు సంబంధించి అనేక నిర్ణయాలు తీసుకుని ప్రభుత్వానికి నివేదిక అందజేస్తామన్నారు. అవిభక్త బళ్లారి జిల్లాలో ఇప్పటికే 5సాహిత్య సదస్సులు జరిగాయన్నారు. గతంలో6వ సమావేశం మొదటిసారిగా 1920లో అఖండ జిల్లాలోని హొసపేటలో రొద్దా శ్రీనివాసరావు అధ్యక్షతన, రెండవసారి 1926లో మే 22నుంచి 24వరకు మూడురోజుల పాటు 12వ అఖిల భారత కన్నడసాహిత్య సదస్సు జరిగిందన్నారు. 12 సంవత్సరాల తర్వాత 23వ కన్నడ సాహిత్య సమ్మేళనాలు డిసెంబర్ 29న 1938 వరకు రంగనాథ్ దివాకర్ అధ్యక్షతన జరిగాయన్నారు. నాల్గవసారి 1947లో హరపనహళ్ళిలో, 11సంవత్సరాలు తర్వాత 1958లో 5వసారి బళ్లారినగరం మున్సిపల్ కళాశాల మైదానంలో వినాయక్ కృష్ణగోకాక్ అధ్యక్షతన జరిగింది. 67సంవత్సరాల తర్వాత సాహిత్య సమ్మేళనాన్ని మళ్లీ నిర్వహిస్తున్నామన్నారు. 88వ అఖిల భారత కన్నడసాహిత్య సదస్సు డిసెంబర్ 2025లో జరుగుతుందన్నారు. నేటి తరం యువజన సమాజంలో కన్నడ సాహిత్య గురించి అవగాహన కల్పించే లక్ష్యంతో బళ్లారిలో రాష్ట్రప్రభుత్వం, రాష్ట్రకన్నడ సాహిత్యపరిషత్, జిల్లా యంత్రాంగం, జిల్లా కన్నడ సాహిత్య పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో మహా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. బళ్లారి జిల్లా మొదటి కలెక్టర్ కమిషనర్‌గా పనిచేసిన సర్ థామస్ మున్రో కుటుంబ సభ్యులను డిసెంబర్‌లో బళ్లారిలో నిర్వహించనున్న అఖిల భారత 88వ సమ్మేళనాన్ని ఘనంగా చక్కగా నిర్వహించడంపై ఇన్‌ఛార్జ్‌మంత్రితో చర్చలు జరుపతామన్నారు. ఈసందర్భంగా కలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రా, జిల్లాపోలీస్ సూపరింటెండెంట్ శోభారాణి, కన్నడసాహిత్య పరిషత్ కోశాధికారి పటేల్‌పాండు, జిల్లాఅధ్యక్షుడు నిష్ఠిరుద్రప్ప, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మహేశ్ జోషి

జొన్నల కొనుగోలులో అక్రమాలు

● రిజిస్ట్రేషన్ రద్దు చేయాలని ఏఐకేకేఎంఎస్ ఆందోళన



నిరసన తెలుపుతున్న ఏఐకేకేఎంఎస్ పదాధికారులు

బళ్లారి సిటీ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నగరంలో జొన్నల కొనుగోలు కేంద్రంలో అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేసి, మళ్లీ ప్రాంభించాలని ఏఐకేకేఎంఎస్ డిమాండ్ చేసింది. మంగళవారం నగరంలోని ఏపీఎంసీ మార్కెట్ కార్యాలయం దగ్గర సంఘం ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. అనంతరం పలు సమస్యలపై జిల్లాకలెక్టర్ వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జిల్లాకలెక్టర్ ప్రశాంత్‌కుమార్ మిశ్రామాట్లాడుతూ జొన్నల రిజిస్ట్రేషన్ నిబంధనలకు విరుద్ధంగా జరిగితే వెంటనే రద్దు చేస్తామన్నారు. 6000 మెట్రిక్ టన్నుల జొన్నలను కొనుగోలు చేసే అవకాశం ఉందని, జిల్లాలోని అందరు రైతుల జొన్నలను నమోదు చేసి కొనుగోలు చేస్తామన్నారు. ఈసందర్భంగా ఏఐకేకేఎంఎస్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి గురల్శిరాజా మాట్లాడుతూ జొన్నలను అక్రమంగా నమోదు చేయడం పాలక వర్గం రైతులకు చేసిన ద్రోహమన్నారు. ఇది ఇలాగే కొనసాగితే రైతు సంఘం మొత్తం వ్యవస్థకు వ్యతిరేకంగా భారీ నిరసన చేపడ్తామన్నారు. ఏటా అక్రమాలు జరుగుతున్నా అరికట్టడంలో అధికారులు విఫలం అవుతున్నారన్నారు. కన్నడ నాడు రైతు సంఘం జిల్లాధ్యక్షుడు పరమేశ్వరప్ప, రాష్ట్ర రైతు సంఘంనాయకుడు మాధవరెడ్డి, లేపాక్షిరైతులు మంజునాథ్,వెంకటేశ్,హొన్నూరప్ప, పంపనగౌడ, యోగేశ్,రుద్రగౌడ, గాదిలింగప్ప, లోకప్ప, లింగారెడ్డి పాల్గొన్నారు.

బసవన్న జయంతిని ఘనంగా చేసుకోవాలి

● ముందస్తు సమావేశంలో ఏడీసీ జుబేర్



బళ్లారి సిటీ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నైతిక సిద్ధాంతిక సందేశాలను సమాజానికి అందించడంలో బసవన్న అందించిన సహకారం అపారమైనదని, అటువంటి భక్తి పారాయణుడు బసవన్న జయంతిని ఘనంగా జరుపుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్(ఏడీసీ) మహమ్మద్ జుబేర్ సూచించారు. నగరంలోని జిల్లాకలెక్టర్ కార్యాలయ ఆడిటోరియంలో బసవన్న జయంతి ఉత్సవాలకు సంబంధించి మంగళవారం జరిగిన ముందస్తు సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. మహానుబావుల జీవిత విలువలను సమాజానికి అందించడానికి జయంతులను జరుపుకుంటామన్నారు. గొప్పవ్యక్తుల ఆదర్శాలను నిలబెట్టడమే వార్షికోత్సవాలు జరుపుకోవడం ఉద్దేశమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం బసవన్నను సాంస్కృతిక నాయకుడిగా ప్రకటించిందని ఆయన అన్నారు. ఏప్రిల్ 30న నగరంలోని హెచ్‌ఆర్ గవియప్ప సర్కిల్ సమీపంలోని బసవేశ్వర విగ్రహం వద్ద నివాళులర్పిస్తారన్నారు. అనంతరం రాత్రిడాక్టర్ జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరంలో బసవన్న జయంతి వేడుకలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం నగరంలోని మున్సిపల్ కళాశాల మైదానం నుంచి భారీ ఊరేగింపు జరుగుతుందన్నారు. గడిగ చెన్నప్ప సర్కిల్,బెంగళూరు రోడ్డు, స్టేషన్ రోడ్డు మీదుగా గవియప్ప సర్కిల్ మీదుగా జోళదరాశి దొడ్డనగౌడ రంగమందిరాన్ని చేరుకుంటుందన్నారు. ఈసందర్భంగా జిల్లాఆరోగ్య విద్యాధికారి ఈశ్వర దాసప్ప, మున్సిపల్ కార్పోరేషన్ రెహమాన్, కన్నడ సాంస్కృతిక శాఖ అధికారులు, సంఘనాయకులు పాల్గొన్నారు.

ముగ్గురు దొంగల అరెస్టు

● 37 బైక్‌లు, రూ.18.50 లక్షల నగదు స్వాధీనం

బళ్లారిరూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): బళ్లారి జిల్లా సండూరు తాలుకాలో పలు చోరీలకు పాల్పడుతున్న ముగ్గురు నిందితులును అరెస్ట్ చేశారు. మంగళవారం విలేకరుల సమావేశంలో ఎస్పీ శోభారాణి మాట్లాడుతూ జిల్లాలోని నందిహళ్లి గ్రామానికి చెందిన తిప్పేస్వామి, అంజి లక్ష్మీపురం నివాసి అయిన నాగరాజులను అరెస్ట్ చేశామన్నారు. సండూరు డీఎస్పీ ప్రసాద్ గోఖలే నేతృత్వంలో వీరిని అరెస్ట్ చేశామని, తోరణగల్లు బైపాస్ వద్ద మూడు ద్విచక్ర వాహనాలు అమ్మేందుకు తిరుగు తుండగా అరెస్ట్ చేశామన్నారు. సండూరు సర్కిల్ ఇన్స్‌పెక్టర్ మౌనీష్‌గౌడ నేతృత్వంలో వారి వద్ద నుంచి 37 బైకులు, రూ.18.5 లక్షలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ ముగ్గురూ తోరణగల్లు సండూరు, కుడితిని, బళ్లారి, కంప్లి తదితర ప్రాంతాల్లో చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. దాడుల్లో తోరణగల్లు ఎస్ఐలు రాకేష్, వీరేష్, డి మల్లిశెట్టి, సండూరు ఎస్ఐ రేవనసిద్దప్ప, చోర్నూరు క్రైమ్ సబ్ ఇన్స్‌పెక్టర్ ఆలూరు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న ద్విచక్రవాహనాలను చూపుతున్న పోలీసులు



మాట్లాడుతున్న కిసాన్ అవేర్‌నెస్ అసోసియేషన్ అధ్యక్షుడు బసవరాజ్

17న పాలసంఘాల నిరసన

బళ్లారి సిటీ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): విజయనగర జిల్లాకు ప్రత్యేక పాల సంఘం ఏర్పాటు, హొసపేటలో మెగా డెయిరీ నిర్మాణం తదితర డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ జిల్లాలోని పాలసంఘాలు, ప్రగతిశీల సంస్థలు 17న నిరసన ప్రదర్శన నిర్వహించాలని నిర్ణయించారు. మంగళవారం హొసపేటలో విలేకరుల సమావేశంలో ఆల్ కర్ణాటక స్టేట్ కిసాన్ అవేర్‌నెస్ అసోసియేషన్ జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బసవరాజ్ మాట్లాడుతూ బళ్లారిలో కేఎంఎఫ్ కార్యాలయం ఉందని, కానీ అక్కడ పాలనాపరంగా సమస్యలు సృష్టిస్తున్నారన్నారు. విజయనగరం జిల్లాలో 1.20లక్షల లీటర్ల పాలు ఉత్పత్తి అవుతున్నాయన్నారు. బళ్లారి, విజయనగరం ,కొప్పళ, రాయచూర్‌లకు దూరంగా ఉన్నందున హొస్పేటలో మెగా డెయిరీ నిర్మించాలన్నారు. గత 40 సంవత్సరాలుగా యూనియన్ ప్రధాన కార్యాలయం బళ్లారిలో ఉంది. జిల్లాకు చెందిన నలుగురు వ్యక్తులు దాదాపు 25సంవత్సరాలుగా యూనియన్ అధ్యక్షులుగా బాధ్యతలు నిర్వర్తించారని, బళ్లారి ప్రజాప్రతినిధులు అధికారం కోసం మాత్రమే పోరాడుతున్నారు తప్ప యూనియన్ అభివృద్ధికి పాటు పడలేదన్నారు. యూనియన్ డైరెక్టర్ మరులసిద్దప్ప మాట్లాడుతూ పాలక మండలి పదవీకాలం ముగిసినప్పటికీ దానిని కొనసాగించాల్సి వచ్చిందని, అభివృద్ధి పనులకు సహకరించడం లేదన్నారు. రబకోవి పరిపాలనా వ్యవస్థ, విజయనగరం జిల్లా సహకారం తదితర అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్ళేందుకు నిరసన ప్రదర్శనకు నిర్ణయించామన్నారు. జిల్లాలోని పాల ఉత్పత్తిదారుల సహకార సంఘాలు, కర్ణాటక రాష్ట్ర రైతు సంఘం, కర్ణాటక రాష్ట్ర కిసాన్ జాగృతి సంఘం, వివిధ ప్రగతిశీల సంస్థలు ఈ నిరసనకు మద్దతు తెలిపాయన్నారు. విలేకరుల సమావేశంలో వెంకటేశ్, సోమన్న, ఉష, లక్ష్మణ, కాటేశప్ప, గోనిబసప్ప పాల్గొన్నారు.

నేడు బళ్లారి రాఘవ వర్ధంతి

బళ్లారి సిటీ,ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నగరంలోని రాఘవ మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నాట్య కళాప్రపూర్ణ బళ్లారి రాఘవ 79వ వర్ధంతిని బుధవారం నిర్వహించనున్నారు. సాయంత్రం రాఘవ కళామందిరంలో కార్యమం నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. నగర మయూర కళా సంఘ బృందంచే 'నిరంతర జీవన పయణ' నాటక ప్రదర్శన ఉంటుందన్నారు.

లారీ అసోసియేషన్ ఆందోళన



నిరసనలో లారీ అసోసియేషన్ అధ్యక్షుడు మించు శ్రీనివాస్ తదితరులు

బళ్లారిరూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నగరంలో లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. బెంగళూరు రోడ్డు ముంద్రిగి సెకెండ్ స్టేజ్ సిరికాటా సమీపంలో బళ్లారి లారీ అసోసియేషన్ అధ్యక్షుడు మించు శ్రీనివాస్ నేతృత్వంలో డీజిల్ ధరలు, టోల్ చార్జీలు తగ్గించాలని ఆందోళన చేపట్టారు. లారీ ఓనర్లు తీవ్ర నష్టాలకు గురవుతున్నారని దీనిపై కేంద్రం చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడ్తున్నా మన్నారు. కార్యక్రమంలో మహబూబ్ బాషా, పెద్దన్న, బసవరాజు, విశ్వనాథ్, ఎస్ఎల్ఎస్ నరసింహులు, ప్రవీణ్‌కుమార్, రామ్‌కుమార్, నీలకంఠేశ్వర నాయుడు, ప్రతాప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కంప్లి: లారీ సంఘాల నేతలు టోల్‌గేట్ తొలగింపు, డీజిల్ రేటు పెంపును నిరసిస్తూ కుడితిని పట్టణంలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు శివ మాట్లాడుతూ.. డీజిల్ ధరలు తగ్గించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామన్నారు. నిరసనలో మహేష్, నాగేష్ స్వామి, భీమేష్ పాల్గొన్నారు.

వీరశైవ కళాశాల చైర్మన్‌గా సతీష్‌బాబు



సతీష్ బాబును సత్కరిస్తున్న పాలకమండలి సభ్యులు

బళ్లారి రూరల్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): బళ్లారి నగరంలో ప్రతిష్ఠాత్మక విద్యా సంస్థ వీరశైవ వీయా అండ్ డిగ్రీ కళాశాల పాలక మండలి నూతన అధ్యక్షుడిగా సతీష్‌బాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భగా ఆయన మాట్లాడుతూ.. కళాశాల విద్య భౌతిక అభివృద్ధికి అవసరమైన అన్ని సహాయాలను అందిస్తానన్నారు. ఈ సందర్భంగా పాలకమండలి సభ్యులు ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గౌతమ్ ఐఎం మహేష్, సంజయ్‌వాణి, కొర్రి సురేష్ పాలక మండలి సభ్యులు గోనాళ్ మంజునాథ్, పంపాపతి, హాలెస్‌గౌడ, బండే గౌడ, నంజుండప్ప, కట్టే గౌడ, అక్కి శివరాజ్, ముద్దనగౌడ, కాలేజ్ సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటా: ఎమ్మెల్యే



అభివృద్ధి పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే గణేష్

కంప్లి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను పరిష్కరిస్తూ ప్రజలకు అండగా వుంటూ ప్రతి గ్రామాన్ని ఆదర్శంగా తీర్చి దిద్దుతానని ఎమ్మెల్యే గణేష్ అన్నారు. మంగళవారం తాలుకా పరిధిలోని రామసాగరం గ్రామంలో సీసీ రోడ్లు, మురికి కాలువలు, పీడబ్ల్యూడీ కేఎస్‌హెచ్‌సీ శాఖ ఆధ్వర్యంలో రూ. 28 లక్షల నిధులతో చేపట్టిన రోడ్డు పనులకు ఆయన భూమిపూజ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో రహదారుల అభివృద్ధి తమ ప్రభుత్వం దృష్టి పెట్టిందన్నారు. రానున్న కాలంలో ఎవరికి టికెట్ ఇచ్చినా పార్టీ విజయానికి కృషి చేస్తానన్నారు. శివన్నగౌడ, నారాయణప్ప, రామయ్య, సీఆర్ హనుమంతు, కాళింగవర్ధన్, శ్రీనివాసరావు, మౌలాలి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

వాగేష్ తీర్థులకు ప్రత్యేక పూజలు



అలంకరణలో బృందావనం

కంప్లి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): కొప్పళ జిల్లా అనెగొందిలోని చారిత్రాత్మక ప్రసిద్ధి చెందిన నవ బృందావన్‌లో మంగళవారం శ్రీవాగేష్ తీర్థులకు వైభవంగా పూజలు నిర్వహించారు. వాగేష్ తీర్థ బృందావనంలో నిర్మల్య నిమజ్జనం నిర్వహించి, ప్రత్యేక ఫల పంచామృత అభిషేకం చేపట్టారు. బృందావనాన్ని వెండి కవచం, పట్టువస్త్రాలతో అలంకరించారు. హొస్పేట మఠాధిపతులు పవన్ ఆచార్య, గంగావతి, మఠా సంచాలకులు సుశీలేంద్ర ఆచార్య, సంజీవ్, కులకర్ణి, శ్రీ విజయదేశాయి గౌటగి, విజయ దేశాయి అష్టోత్తర పారాయణం నిర్వహించారు.

హోసూరు జోన్

వైభవంగా వినాయక ఆలయ వార్షికోత్సవం



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

హోసూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని కామరాజనగర్‌లోని జ్ఞానశక్తి వినాయక ఆలయ 16వ వార్షిక ప్రతిష్ఠాపన కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయంలో శివుడు, గణపతి, మురుగన్, అయ్యప్ప దేవతామూర్తులు ఉన్నారు. ఆలయంలో తెల్లవారుజామున సుప్రభాతసేవ, గణపతి హోమం, నవగ్రహ హోమాలు నిర్వహించారు. కుంభాభిషేక కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిగింది. పవిత్ర నదులనుంచి తెచ్చిన జలాలలతో విశేషపూజలు చేశారు. సాయంత్రం కామరాజ్‌నగర్ ప్రధానవీధుల్లో జ్ఞానశక్తి వినాయకుడి ఊరేగింపు జరిగింది.

ప్రమాదంలో వ్యక్తి మృతి

● అవయవదానం చేసిన కుటుంబ సభ్యులు



మునిరాజ్‌కు ప్రభుత్వం తరపున నివాళి అర్పిస్తున్న అధికారులు

హోసూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో మృతి చెందిన వ్యక్తి అవయవాలను కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో అందజేశారు. ఈనెల 12న ముకులపల్లిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పెరుమాళ్‌పల్లికి చెందిన మునిరాజ్(48) తీవ్ర గాయాలపాలయ్యారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం కన్నుమూశారు. అవయదానం చేయాలని మృతుడి కుటుంబ సభ్యులు కోరగా అధికార యంత్రాంగం సానుకూలంగా స్పందించింది. అతడి అవయవాలను కృష్ణగిరి ప్రభుత్వ వైద్య కళాశాల ఆసుపత్రికి అందజేశారు. మంగళవారం అంత్యక్రియల్లో సబ్ కలెక్టర్ గీతారాణి ప్రభుత్వం తరఫున మునిరాజ్ మునిరాజ్‌కు గౌరవవందనం సమర్పించారు. తాలూకా అధికారి ఇన్‌చార్జ్ బాలాజీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



వేదికపై మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పన్నీర్‌సెల్వం తదితరులు

కార్పొరేషన్ అక్రమాలపై అన్నాడీఎంకే నిరసన

హోసూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): హోసూరు కార్పొరేషన్‌లో జరిగిన అక్రమాలను ఖండిస్తూ అన్నాడీఎంకే ఆధ్వర్యంలో భారీ నిరసన చేపట్టారు. నగరంలో మంగళవారం భారీ నిరసనలో కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి బాలకృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే పన్నీర్‌సెల్వం తదితరులు పాల్గొన్నారు. బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ హోసూరు మునిసిపాలిటీగా ఉన్నప్పుడు ప్రతి నెలా రూ.30లక్షల ఖర్చుతో చెత్తను తొలగించేవారన్నారు. కానీ కార్పొరేషన్‌గా విస్తృతమయ్యాక చెత్తను తొలగించేందుకు రూ.1.50కోట్లు ఖర్చు అవుతోందన్నారు. అయితే ఇందుకు సంబంధించి కోట్లాదిరూపాయలు అక్రమాలు జరిగాయని ఆరోపించారు. బాగలూరు రోడ్డు గుంతమయంగా ఉందని మేయర్, ఎమ్మెల్యే అందరూ ఒకే రోడ్డు ఉపయోగిస్తున్నా నాలుగేళ్లుగా మరమ్మతులకు నోచుకోలేదన్నారు. పన్నీర్‌సెల్వం మాట్లాడుతూ అన్నాడీఎంకే హయాంలో రామనాయక్కన్ చెరువు ఆధునీకరించేందుకు నిధులు కేటాయించినా ఇంకా ఆ పనులు పూర్తి కాలేదన్నారు. కాగా హోసూరు ప్రాంతంలో గులాబీలు విస్తృతంగా సాగు చేస్తున్నారని పూలను విదేశాలకు ఎగుమతి చేసేందుకు రూ.22కోట్లతో అంతర్జాతీయ పూల మార్కెట్‌ను ప్రారంభించారని అయితే వేలంకేంద్రం కేవలం ఒక ప్రదర్శనశాలగా ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా మౌలిక సదుపాయాల కల్పనకు పలు చోట్ల హై ఓల్టేజ్ టవర్‌లు నిర్మించారని, లే అవుట్‌ల మంజూరులోనూ పలు అక్రమాలు జరిగాయని ఆరోపించారు. ప్రజాధనం వృథాపై విచారణ జరగాలన్నారు. నిరసనలో పెద్దసంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నిరసనలో పాల్గొన్న ప్రజలు, కార్యకర్తలు